
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5



శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 1 ఆగస్టు 2025

ఇదేం మత్తు..!

- గంజాయి కాదని ఎస్పీ ప్రకటన
- మద్యం మత్తులోనే గొడవ అని స్పష్టం
- కాదు.. గంజాయే అంటున్న తల్లిదండ్రులు
- సమస్యను వదిలేసి.. హక్కులపై అవగాహన
- కాళసముద్రంలో ఎస్పీ రత్నకు చేదు అనుభవం
- న్యాయం కోసం చుట్టుముట్టిన చిన్నారుల తల్లులు
- విష రసాయనం తాగేందుకు యత్నం

గంజాయికి బానిసయ్యాడు

నా కుమారుడు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసయ్యడు. పలుమార్లు దండించినా మార్పురాలేదు. మత్తుకు అలవాటుపడిన మైనర్లు వారి స్నేహితులకు కూడా అలవాటు చేస్తున్నారు. వారి బంగారు భవిష్యత్తు నాశనమౌతుంటే తల్లిదండ్రులుగా ఏం చేయాలో తోచడంలేదు. పోలీసులు గంజాయి సరఫరాపై నిఘా పెట్టి, కఠిన చర్యలు తీసుకోవాలి.

-కాళసముద్రం గ్రామానికి చెందిన
ఓ తండ్రి ఆవేదన

మత్తు కాదు.. మందు

కదిరి మండలంలో గంజాయి మత్తులో యువకులు గొడవపడినట్లు మీడియాలో ప్రచారం చేశారు. ఇది వాస్తవం కాదు. మద్యం మత్తులో గొడవ పడినట్లు మా విచారణలో తేలింది. మీడియా, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

- ఎస్పీ రత్న



ఐదు రోజుల క్రితం కాళసముద్రం బాలలపై జరిగిన దాడి



ఎస్పీని నిలదీస్తున్న మహిళ

కదిరి అర్బన్, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రంలో గంజాయి వ్యవహారంపై పోలీసులు దాగుడుమూతలు ఆడుతున్నారా..? తమ బిడ్డలు మత్తుకు బానిసలయ్యారు.. కాపాడండి అని గ్రామస్థులు నెత్తీనోరు కొట్టుకుంటుంటే.. పోలీసులు మాత్రం అది గంజాయి కాదు, మద్యం అని స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. పైగా 'గంజాయి' అని రాస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మీడియాను హెచ్చరిస్తున్నారు. అది గంజాయి కాకుండా, మద్యమే అయితే కొంత నయమే. కానీ 'గంజాయి' అని చెబుతున్నది తల్లిదండ్రులు కదా..? ఇలాంటి వ్యవహారాల్లో తమ బిడ్డల పాత్ర ఉంటే సాధారణంగా తల్లిదండ్రులు గోప్యంగా ఉంచుతారు. కానీ నిస్సహాయ స్థితిలో మీడియా ఎదుట బహిరంగంగా చెబుతున్నారు. తమ బిడ్డలను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంజాయిని కట్టడి చేసి, తమ బిడ్డలను పోలీసులే రక్షించాలని వేడుకుంటున్నారు. ఏమీ తెలియకుండానే తల్లిదండ్రులు తమ బిడ్డలే గంజాయికి అలవాటు పడ్డారని చెబుతారా..?

ఇదేం చోద్యం..?

ఆ ఊరికి గంజాయి నిజంగానే వస్తోందా..? బడికో.. కాలేజీకో వెళ్లే మైనర్లకు మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి..? పోనీ.. ఎస్పీ చెప్పినట్లుగానే అది మద్యమే అయినా.. మైనర్లకు విక్రయించేవారిపై చర్యల దిశగా ఎందుకు ప్రయత్నాలు చేయడం లేదు..? మైనర్లు దాడిచేస్తున్న దృశ్యాలను చూస్తే ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. 'రేయ్.. జైలుకు వెళ్లేందుకైనా సిద్ధం..' అనే స్థాయికి పసివారు దిగజారిపోయారు. 'రేయ్ వదిలిపెట్టండ్రా.. ప్లీజ్' అని బాధిత బాలురు వేడుకుంటున్నా కనికరించలేదు. దీనికి పగ, ప్రతీకారాలు కారణం కాదు..! మత్తు మాత్రమే కారణమని దాడి చేస్తూ దూషించేవారి మాటలను వింటే స్పష్టంగా అర్థమౌతోంది. ఇలాంటి సమయంలో అసలు విషయాన్ని పక్కకు నెట్టి.. 'చట్టపరమైన చర్యలు' అని మీడియాను బెదిరించడం విస్మయం కలిగిస్తోంది. చిన్నారుల విషయంలో అసత్య ప్రచారం చేయాల్సిన అవసరం మీడియాకు ఏముంటుంది..?

కుమిలిపోతున్న తల్లిదండ్రులు

గంజాయి మత్తుకు బానిసలుగా మారిన తమ పిల్లలు చేస్తున్న వికృత (మిగతా 6లో)

మీ పింఛన్‌కు మాదీ పూచీ..!

- దివ్యాంగ పింఛన్‌దారులే టార్గెట్
- వెరిఫికేషన్‌కు వెళ్లే వారి నుంచి వసూళ్లు
- పుట్టుకొచ్చిన దళారులు

పుట్లూరు మండలంలోని ఓ పంచాయతీకి చెందిన వ్యక్తి.. సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానంటూ రూ.20 వేలు వసూలు చేశాడు. నెలలు గడిచినా సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో సదరు పింఛన్‌దారుడు.. ఆ వ్యక్తితో వాగ్వాదానికి దిగాడు. అతడి ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. తన డబ్బులు ఇచ్చి ట్రాక్టర్ తీసుకెళ్లాలని తెగేసి చెప్పాడు.

మండలంలోని మరో గ్రామంలో ముగ్గురి దివ్యాంగ పింఛన్లు కాపాడతానంటూ ఒక్కొక్కరి నుంచి ఓ దళారి రూ.30వేలు చొప్పున రూ.90వేలు వసూలు చేసి, చేతులెత్తేశాడన్న ఆరోపణలు ఉన్నాయి.
ఇంకో గ్రామంలో ఏకంగా సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానంటూ ఆర్‌ఎంపీ దుకాణం తెరిచాడన్న ప్రచారం జరుగుతోంది.

పుట్లూరుకు ఐదు కిలోమీటర్ల దూరంలోని గ్రామంలో పింఛన్ పోకుండా కాపాడాలంటే ముందుగానే డబ్బు ఇవ్వాలని దళారీ చెప్పాడట. వచ్చేనెల పింఛన్ డబ్బులు వస్తే అప్పుడు నిలబెట్టినట్లు నమ్మి, డబ్బు ఇస్తామంటూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది.



యాడికి/పుట్లూరు, జూలై31(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలనను క్యాష్ చేసుకునేందుకు దళారులు పుట్టుకొచ్చారు. పింఛన్ పోకుండా కాపాడతామంటూ లబ్ధిదారులను నమ్మబలుకుతున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తామంటూ కూడా డబ్బులు గుంజుతున్నారని తెలుస్తోంది. యాడికి, పుట్లూరు మండలాల్లో పింఛన్‌దారులనే టార్గెట్‌గా చేసుకుని (మిగతా 6లో...)

అక్రమ మద్యం వరద..!

- అడ్డదారుల్లో జిల్లాలోకి ప్రవేశం
- 8 నెలల్లో 18,447 లీటర్లు సీజ్
- 3,121 కేసులు.. 3,012 మంది అరెస్టు..
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 280 వాహనాలు సీజ్



అనంతపురం క్రైం, జూలై31(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం సరిహద్దులు దాటొస్తోంది. సుంకం కట్టని మద్యం (ఎన్‌డీపీఎల్) కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి జి ల్లాలోకి వరదలా వస్తోం ది. ఎనిమిది నెలల వ్యవధిలోనే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోకి ఏకంగా 13 వేల లీటర్ల పైచిలుకు అక్రమ మద్యం ప్రవేశించిందంటే ఏస్థాయిలో దందా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇది అధికారులకు పట్టుబడినదే. పట్టుబడని మద్యం ఇంతకు చాలా రెట్లు ఎక్కువగా ఉండొచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్టుల్లో భారీగా అక్రమ మద్యం పట్టుబడుతోంది. సరిహద్దు మండలాల్లో నాటుసారా పెద్దఎత్తున కాస్తున్నారు. బెల్టుషాపులు సైతం వెలిశాయి. గతేడాది సెబ్‌ను రద్దు చేయడంతో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో దాడులు చేశారు. పన్ను చెల్లించని మద్యం, నాటుసారా, బెల్టు దుకాణాల్లో 18,447 లీటర్లు పట్టుకుని, సీజ్ చేశారు. 3 వేల పైచిలుకు కేసులు పెట్టారు. మూడువేల మందికిపైగా అక్రమ మద్యం తరలిస్తున్న వారిని అరెస్టు చేశారు.

సరిహద్దుల్లోనే ఎక్కువ

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు కర్ణాటకతో ఎక్కువభాగం సరిహద్దును పంచుకుంటున్నాయి. సరిహద్దు మండలాల గుండా భారీగా అక్రమ మద్యం జిల్లాలోకి ప్రవేశిస్తోంది. డీ హిరేహాళ్, కంబదూరు, శెట్టూరు, కుందుర్పి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు, మడకశిర, అమరాపురం, రొళ్ల తదితర మండలాల గుండా కర్ణాటక తదితర ప్రాంతాల నుంచీ మద్యం వస్తోంది. టూవీలర్లు, ప్రత్యేక వాహనాల్లో వీటిని తీసుకొస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నాటుసారా సైతం కాస్తున్నారు. గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, కంబదూరు, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం స్టేషన్ల పరిధిలో నాటుసారా తయారవుతోంది. సెబ్ రద్దు తర్వాత గతేడాది అక్టోబరు 15 నుంచి ఈ ఏడాది జూలై చివరి వారం వరకూ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో భారీగా దాడులు చేశారు. డొనేకల్లు, విడపనకల్లు, ఓబుళాపురం, తూముకుంట, కొడికొండ చెక్ పోస్టుల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, మడకశిరలో ఉన్న బార్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు సైతం తనిఖీలు చేస్తున్నాయి. ఫలితంగా పన్ను చెల్లించని మద్యం 13,534 లీటర్లు సీజ్ చేసి, 1,516 కేసులు కట్టారు. 1,568 మందిని అరెస్టు చేయడంతోపాటు 185 వాహనాలు సీజ్ చేశారు. 2,580 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సుమారు 82,235 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా రవాణా చేస్తున్న 18 వాహనాలు సీజ్ అయ్యాయి. బెల్టు దుకాణాలకు అక్రమంగా తరలిస్తున్న 2,333 లీటర్ల మద్యం సీజ్ చేయడంతోపాటు 990 కేసులు నమోదు చేశారు. వీటి పరిధిలో 996 మందిని అరెస్టు చేశారు. ఈ కేసుల్లో 77 వాహనాలను (మిగతా 6లో..)

వైసీపీ దోపిడీ రూ.11 కోట్లు..!

- మున్సిపాలిటీ పన్ను వసూళ్లలో మాయాజాలం
- ఖజానాకు జమ చేయకుండా జేబుల్లోకి..
- రెవెన్యూ సర్వేలో బహిర్గతం
- 2,532 భవనాల్లో అక్రమాల గుర్తింపు



సర్వే నివేదికను కమిషనర్‌కు అందజేస్తున్న ఆర్‌ఓ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో వైసీపీ పాలకులు దోపిడీ సాగించారు. ఐదేళ్లు పన్ను వసూళ్లలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. ఈ విషయం సర్వేలో బహిర్గతమైంది. ఉమ్మడి అనంత జిల్లాలోని నగర పాలక సంస్థ, 11 మున్సిపాలిటీల్లో ఏకంగా రూ.11 కోట్లు జేబుల్లోకి వేసుకున్నట్లు తేలింది. 2,532 భవనాల నుంచి వసూలు చేసిన పన్నులను పంచేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. తాజాగా చేపట్టిన ఇంటింటి సర్వేలో వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన దోపిడీ, నిధుల దుర్వినియోగం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మున్సిపల్ శాఖలో వసూలు చేసిన పన్నుల సొమ్ము ప్రభుత్వ ఖజానాకి జమ చేయకుండా జేబుల్లోకి వేసుకున్న ఉదంతం తాజాగా బయటపడింది. వైసీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు నిధుల స్వాహాలో భాగస్వాములైనట్లు తెలుస్తోంది. మెక్కిన సొమ్మును ఏ విధంగా (మిగతా 6లో...)

బంగారం లెక్క చెప్పండి

బ్యాంకర్లకు పోలీసు అధికారుల సూచన

భద్రత లేకపోవడంపై ఖాతాదారుల ఆందోళన



బ్యాంకు అధికారులకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

హిందూపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): తూముకుంట పారిశ్రామిక వాడ ఎస్బీఐ శాఖలో భారీ దోపిడీ జరిగిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పట్టణానికి దూరంగా ఉన్న ఈ బ్యాంకు శాఖలో తాకట్టు పెట్టిన బంగారం, పర్సనల్ లాకర్‌లో పెట్టిన బంగారం లెక్కలు చూసి అవాక్కయ్యారు. ఈ ఒక్క బ్యాంకులోనే ఇంత మొత్తం ఉంటే పట్టణంలోని మిగతా బ్యాంకుల పరిస్థితి ఏంటని ఆరా తీయడం ప్రారంభించారు. వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన హిందూపురంలో వ్యాపారులు, రియల్టర్లు, భూస్వాములు, ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారు. వీరిలో కొంతమంది అవసరాల కోసం తాకట్టుపెట్టగా మరికొంతమంది ఇంట్లో బంగారాన్ని పెట్టుకునేందుకు భయపడి పర్సనల్ లాకర్‌లో పెట్టారు. దీంతో ఇప్పటి వరకు ఏయే బ్యాంకులో ఎంత బంగారం ఉందో పోలీసులకు అర్థంకాని పరిస్థితి. ఈ తరుణంలో ఏఏబ్యాంకులో ఎంత మొత్తంలో బంగారం తాకట్టు పెట్టారో, పర్సనల్ లాకర్‌లు ఎంతమంది వినియోగిస్తున్నారనే వివరాలు ఇవ్వాలని పోలీసు అధికారులు బ్యాంక్ అధికారులకు సూచించారు. ఎందుకంటే పెద్దమొత్తంలో బ్యాంక్‌లో బంగారం ఉంటే రాత్రిపూట ఆ బ్యాంక్‌ల వద్ద గస్తీ తిరగడానికి ఆస్కారం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

నిద్రపోతున్నారా..?

ఎంతో నమ్మకంతో లక్షలు విలువ చేసే తమ బంగారాన్ని బ్యాంకుల్లో పెడితే అధికారులు సరైన భద్రత కల్పించకుండా నిద్రపోతున్నారా అని పలువురు ఖాతాదారులు నిలదీస్తున్నారు. పుట్టింటివారు ఇచ్చిన నగలు, మోజుపడి కొనుక్కున్న నగలను దొంగలు ఎత్తుకెళ్తే తమ పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోని ఓ బ్యాంక్‌లో వందల కిలోల బంగారు ఆభరణాలు, తాకట్టు, లాకర్లలో ఉన్నట్లు తెలిసింది. ఓ బ్యాంక్ ఉద్యోగి తెలిపిన వివరాల మేరకు హిందూపురం పట్టణంలో బ్యాంకులు, ఫైనాన్స్‌లలో వేల కిలోల బంగారం ఉన్నట్లు అంచనా. కానీ ఆ బంగారానికి సరైన భద్రత కల్పించలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణంలో చాలా బ్యాంకులకు వాచ్‌మెన్ కూడా లేడు. తూముకుంటలో జరిగిన సంఘటనతో పట్టణంలోని బ్యాంకుల్లో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టిన ఖాతాదారుల్లో ఆందోళన మొదలైంది.

దొరకని ఆధారం

కాగా తూమకుంట ఎస్బీఐ బ్యాంకులో భారీ దోపిడీ జరిగి నాలుగు రోజులైనా పోలీసులకు చిన్నపాటి ఆధారం కూడా దొరకలేదు. డీఎస్పీ మహేష్, సీఐలు ఆంజనేయులు, జనార్దన్ తూమకుంటలో ఉంటూ సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. ఏ ఒక్క కెమెరాకు దొరకకుండా దుండగులు వెళ్లడం గమనార్హం. ఇప్పటికే దొంగలను గాలిస్తూ ఏడు బృందాలు నాలుగు రాష్ట్రాలకు తరలివెళ్లాయి.

నోటీసులు అందజేస్తున్నాం..

బ్యాంకుల్లో భద్రతపై సంబంధిత అధికారులకు నోటీసులు అందజేశాం. ఎందుకంటే తూమకుంట బ్యాంకులో బంగారం ఉంచిన లాకర్లు చాలా నాసిరకంగా ఉన్నాయి. భవనానికి కిటికీలు సైతం భద్రంగా లేవు. దీంతో ఇతర బ్యాంకుల పరిస్థితి ఏంటని ఆరాతీస్తున్నాం. బ్యాంకులో ఉన్న బంగారు ఆభరణాలు ఎంతమొత్తంలో ఉన్నాయో అంచనాగా చెప్పమని బ్యాంకర్లను కోరాం.

- మహేష్, డీఎస్పీ,
హిందూపురం

వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- జేసీ అభిషేక్ కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గురువారం తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ 2007 చట్టం అమలుపై జేసీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. వయోవృద్ధులు, వృద్ధులైన తల్లిదండ్రులను ఇబ్బంది పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమీక్షలో ఆర్డీఓలు సువర్ణ, మహేష్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు అర్చన, డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం,డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా న్యాయసేవాధికార సంస్థ తరఫున సీనియర్ అడ్వకేట్ నల్లప్ప పాల్గొన్నారు.

పురం అభివృద్ధి కోసం ఢిల్లీలో బాలయ్య

- కేంద్రమంత్రులకు వినతులు



కేంద్రమంత్రి గడ్కరీకి వినతిపత్రం అందిస్తున్న బాలకృష్ణ

హిందూపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): హిందూపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిసి వినతిపత్రాలు అందించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీలు పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, బాలకృష్ణ చిన్నల్లుడు శ్రీభరత్‌తో పాటు పలువురు ఎంపీలతో కలిసి కేంద్రమంత్రులను కలిశారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి హిందూపురానికి రింగు రోడ్డును మంజూరు చేసి, నిధులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తీసుకెళ్లిన ఫైల్‌ను అందజేశారు. కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్సుక్‌మాండవీయను కలిసి తూమకుంట పారిశ్రామికవాడలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి, సిబ్బందిని కేటాయించాలని విన్నవించారు. పట్టణాభివృద్ధి, హౌసింగ్ శాఖ మంత్రి మనోహర్ ఖట్టర్‌ను కలిసి హిందూపురం పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్రమంత్రులు జేపీ నడ్డా, హరిదీప్‌సింగ్ పూరితో కలిసి హిందూపురం నియోజకవర్గం అభివృద్ధికి వారి శాఖల ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. పార్లమెంట్ నూతన భవనాన్ని సందర్శించి, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను కలిశారు. అంతకు ముందు తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీలు బాలకృష్ణకు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ ఓ ప్రకటన విడుదల చేశారు. సినిమాల్లో ఎంత బిజీగా ఉన్నా హిందూపురం అభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు సంబంధితశాఖల అధికారులతో మాట్లాడుతుంటానన్నారు. వచ్చేనెల 2న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని మరోసారి కలిసి రింగు రోడ్డు గురించి చర్చిస్తానన్నారు.

ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం

- గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- పుట్టపర్తిలో ఘనంగా బీజేపీ శోభాయాత్ర

పుట్టపర్తి రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. రాయలసీమలో ఆయన చేపట్టిన శోభాయాత్ర గురువారం జిల్లా కేంద్రం పుట్టపర్తికి చేరుకుంది. ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో చాయ్‌పే చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన లేపాక్షి, పెనుకొండలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు బీజేపీ సహకారం ఉంటుందన్నారు. ఉత్సవాలకు ప్రధాని, రాష్ట్రపతి రానుండటం సంతోషకరమన్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం బాబా పేరుతో వంద రూపాయల నాణెం విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

విద్యాగిరి నుంచి ప్రారంభం

విద్యాగిరి నుంచి ప్రారంభమైన శోభాయాత్ర బస్టాండ్ గణేష్‌గేట్ మీదుగా హనుమాన్ దేవాలయం ఆర్వీజే కల్యాణమండపం చేరుకుంది. శోభాయాత్రలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొన్నారు. కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సమస్యలు గుర్తించి కార్యవర్గాన్ని ఎంపిక చేస్తామన్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. జిల్లాలో పరిశ్రమలను స్థాపించి, యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో పండ్లతోటలకు సంబంధిచిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుతో పాటు ఐటీరంగ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ జిల్లా మార్పు విషయంలో ఎలాంటి హామీలు ఇవ్వలేదని, ప్రజలు అపోహలు నమ్మవద్దన్నారు. భగవాన్ సత్యసాయి బాబా మానవాళికి అందించిన సేవలు అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్, రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మిట్టావంశీకృష్ణ, గుడిసె దేవానంద్, నాగోతు రమేష్‌నాయుడు రమణమూర్తి, రమేష్ రెడ్డి, తలుపుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో శోభాయాత్రలో పాల్గొన్న మాధవ్, సత్యకుమార్

అప్పుల్లో అన్నదాత..
బడాబాబుల సేవలో మోదీ..
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం
6
పురం రైల్వే స్టేషన్‌ను
మోడల్‌గా తీర్చిదిద్దుతాం
- రైల్వే జీఎం ముకుల్ శరన్ మథూర్

మీ పింఛన్‌కు మాదీ పూచీ..!

(5వ పేజీ తరువాయి)

దళారులు వసూళ్లకు తెగబడుతున్నారు. యాడికి మండలవ్యాప్తంగా ఇప్పటివరకు 231మందికి వైకల్య పునఃపరిశీలనకు వెళ్లవలసిందిగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేశారు. తాడిపత్రి, అనంతపురం ప్రభుత్వ వైద్యశాలలకు పంపిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొన్న కొందరు దళారులు.. డాక్టర్లతో తాము మాట్లాడతామనీ, వైకల్య సర్టిఫికెట్ వచ్చేలా చేస్తామంటూ వైకల్యం పునఃపరిశీలనకు వెళ్లే వారిని బురిడీ కొట్టిస్తూ డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారు. మండలంలోని చిక్కేపల్లికి చెందిన దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులు వైకల్య పునఃపరిశీలనకు తాడిపత్రికి వెళ్లారు. వారితో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తితోపాటు యాడికికి చెందిన ఆర్ఎంపీ దళారుల అవతారం ఎత్తి అక్రమ వసూళ్లు చేసినట్లు పలువురు వైకల్య పునఃపరిశీలనకు వెళ్లినవారు తెలిపారు. వైకల్య పునఃపరిశీలనకు వెళ్లిన వారితో రూ.20వేల నుంచి 30వేలు డిమాండ్ చేసి వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. అడిగినంత ఇవ్వకపోతే వైకల్య ధృవీకరణ సర్టిఫికెట్‌లో వైకల్యశాతం పూర్తిగా తగ్గించి ఇస్తారనీ, దాంతో మీ పింఛన్లు తొలగిస్తారని వైకల్య పునఃపరిశీలనకు వెళ్లే వారిని భయభ్రాంతులకు లోనుచేసి వారితో డబ్బులు ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. ఇలాంటి దళారులపై అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీ సర్పంచ్‌ల వసూళ్లు

పుట్లూరు మండలంలో కొందరు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఇప్పటికే మండలంలో పలు పింఛన్లను అమ్యామ్యాలు పుచ్చుకుని, నిలబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలవ్యాప్తంగా 108 మంది పింఛన్ లబ్ధిదారులకు అధికారులు నోటీసులు అందించారు. వైద్యాధికారుల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో పింఛన్లను నిలబెడతామంటూ వసూళ్లకు తెగబడుతున్నారు. చాలా గ్రామాల్లో వైసీపీ మద్దతు సర్పంచులే కొందరు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

డబ్బులు ఇచ్చి మోసపోకండి



పింఛన్‌దారులు దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. అర్హుల పింఛన్లను తొలగించరు. సదరం సర్టిఫికెట్లు ఇప్పిస్తామనీ, పింఛన్లను నిలబెడతామంటూ దళారులు చెప్పే మాటలు పూర్తిగా అవాస్తవం. ఎవరైనా అలా వసూలు చేస్తుంటే మా దృష్టికి తీసుకురావాలి.

- అలివేలమ్మ, ఎంపీడీఓ, పుట్లూరు

వైసీపీ దోపిడీ రూ. 11 కోట్లు

(5వ పేజీ తరువాయి)

వసూలు చేస్తారో చూడాలి.

అడ్డగోలుగా..

వైసీపీ ఐదేళ్ల పాలనలో మున్సిపాలిటీల్లో అడ్డగోలుగా నిధులు దోచేశారు. ఇంటి పన్నులు వసూళ్లలో మాయాజాలం ప్రదర్శించారు. వైసీపీ నేతలతో సిబ్బంది కుమ్మక్కై యథేచ్ఛగా నిధులు మెక్కేశారు. వసూలు చేసిన పన్ను వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా మాన్యువల్ స్లిప్పులు ఇచ్చి కాజేసినట్లు తేలింది. తాజాగా ఈ విషయాన్ని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు నిగ్గుతేల్చారు. ఆ సొమ్ము అప్పటి అధికారుల నుంచి రికవరీ చేయాలా, వైసీపీ నేతల నుంచి రాబట్టాలా అన్న అంశంపై స్పష్టత లేదు. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేయడంపై ఇంటింటా సర్వే చేశారు. 12 మున్సిపాలిటీల్లో 500 మంది రెవెన్యూ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటా సర్వేలో పాల్గొన్నారు. నివేదికలను ఆయా ఉమ్మడి జిల్లాల నగరపాలక సంస్థ కమిషనర్లకు అందజేశారు. వారి నుంచి మున్సిపల్ ఆర్డీ కార్యాలయానికి నివేదికలు చేరవేస్తున్నారు. వాటి ఆధారంగా ఎన్ని ఇళ్ల నుంచి ఎంత మేర వసూలు చేసి, జేబుల్లోకి వేసుకున్నారనే అంశంపై మరోసారి మున్సిపల్ శాఖ అధికారులు విచారణ చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.

వ్యత్యాసం ఉన్న వాటిపైనే సర్వే

- బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్



గతంలో ఇంటి పన్ను వసూళ్లలో వ్యత్యాసం ఉన్నట్లు పురపాలక శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. అనంతపురం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ పరిధిలోని 42 మున్సిపాలిటీల్లో ఇంటింటి సర్వే చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అదనపు కుదింపుతో రెవెన్యూ లోటు వచ్చింది. ఈ విషయంలో స్పష్టత కోసమే సర్వే చేయించారు. ఐదు రోజులపాటు ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో 500 మంది సిబ్బంది సర్వేలో పాల్గొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ చేపడతాం.

అప్పుల్లో అన్నదాత..
బడాబాబుల సేవలో మోదీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం



ధర్మవరం బహిరంగ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురంరూరల్/ధర్మవరం, జూలై31(ఆంధ్రజ్యోతి): దేశంలో అన్నదాతలు అప్పుల ఊబిలో చిక్కి విలవిల్లాడుతుంటే.. ప్రధాని మోదీ మాత్రం బడాబాబుల సేవలో తరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. అనంతపురం రూరల్ మండలం కందుకూరులో రాప్తాడు నియోజకవర్గ, ధర్మవరంలో జిల్లా మహాసభలు నిర్వహించారు. తొలుత భారీ ర్యాలీలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన సభల్లో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతులకు ఒరిగింది శూన్యమన్నారు. కాంగ్రెస్ పోతేనే రైతులకు న్యాయం జరుగుతుందంటూ ప్రగల్భాలు పలికి గద్దెనెక్కిన బీజేపీ దశాబ్ద కాలంలో చేసింది ఏమీలేదని దుయ్యబట్టారు. నాలుగు నెలలకోసారి రూ.రెండు వేలు ఇచ్చి చేతులు దులుపుకొంటోందన్నారు. రైతులను భిక్షగాళ్లలా చూస్తున్నారన్నారు. అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పెట్టుబడులు కూడా దక్కక అప్పుల పాలవుతున్నారన్నారు. అలాంటి అన్నదాతను ఆదుకోవాల్సిన కేంద్రం ఆ ఊసే మరచిందన్నారు. కోటీశ్వరులకు కొమ్ము కాస్తోందన్నారు. వారి ఆస్తులను మరింత పెంచేందుకే పనిచేస్తున్నారన్నారు. ప్రపంచంలోనే ధనవంతులుగా మారేందుకు అన్నివిధాలా సహకరిస్తోందన్నారు. సామాన్యుల స్థితిగతుల్లో ఎలాంటి మార్పు ఉండటం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు కోసం అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం కూడా రైతులకు చేసిందేమీ లేదన్నారు. ఏడాది తరువాత కేంద్రంసొమ్ముతో కలిపి రూ.7వేలు ఇస్తామంటున్నారని దుయ్యబట్టారు. రైతులేమైనా భిక్షగాళ్లా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర రాష్ట్రకార్యవర్గసభ్యులు రామచంద్రయ్య, జాన్సన్‌బాబు, జగదీశ్, అనంత, శ్రీసత్యసాయి జిల్లాల కార్యదర్శులు, జాఫర్, వేమయ్యయాదవ్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, సీపీఐ రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల కార్యదర్శులు రామకృష్ణ పాల్గొన్నారు.

5 నుంచి క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5 నుంచి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్ భాస్కర్ తెలిపారు. అండర్-22 విభాగంలో బాల, బాలికలకు ఆర్చరీ, అథ్లెటిక్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిపోటీలు నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో జరుగుతా యన్నా రు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలకు జోనల్ స్థాయి తిరుపతి లో, జోనల్ స్థాయిలో గెలుపొందిన విజేతలకు రాష్ట్రస్థాయి విశాఖ పట్నంలో పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు సెల్ నంబరు 9849421462ను సంప్రదించాలని కోరారు.



ప్యాసింజర్ రైలు రావడంతో స్టేషన్‌లో రద్దీ

సమయానికి వస్తే బాగుంటుంది



విధి నిర్వహణలో భాగంగా రోజూ అనంతపురం నుంచి ధర్మవరానికి రాకపోకలు సాగిస్తున్నా. ప్యాసింజరు రైలు సమయానికి వస్తే చాలా ప్రయోజనకరం. ఆలస్యమైతే విధులకు వెళ్లడం ఇబ్బంది అవుతోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాల్సిన పరిస్థితి వస్తోంది.

- శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగి

ఎప్పుడొస్తుందో.. ఎప్పటికి చేరుస్తుందో తెలియని దుస్థితి

అడుగడుగునా క్రాసింగ్‌లే..

సమయానికి గమ్యానికి చేరుకోలేకపోతున్న విద్యార్థులు, ఉద్యోగులు

పట్టించుకోని రైల్వే యంత్రాగం

ఎడ్లబండే నయం..!

సమయపాలన పాటించని తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు


కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజరులో ప్రయాణం అంటే జంకాల్సిన పరిస్థితి. విద్యాసంస్థలకు విద్యార్థులు, కార్యాలయాలకు ఉద్యోగులు చేరుకునేందుకు వీలుగా రైలు షెడ్యూల్ ఉంది. సమయానికి వచ్చింది ఏనాడూ లేదు. ఎప్పుడొస్తుందో తెలీదు.. ఎప్పటికి గమ్యానికి చేరుస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి. రైలును నమ్మి ఆఫీసులకు బయల్దేరిన ఉద్యోగులు మధ్యాహ్నానికి చేరుతున్నారు. స్కూళ్లకు, కాలేజీలకు ఆలస్యంగా చేరుకుంటూ చీవాట్లు తినాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. నడిచేదే చాలా నిదానం. ఇది చాలదన్నట్లు అడుగడుగునా క్రాసింగ్‌లే. విద్యార్థులు, ఉద్యోగులు, తిరుపతి వెళ్లే వారికి ఎంతో ఉపయోగకరమని ఈ ప్యాసింజరు రైలును సమయానికి నడపడంలో రైల్వే తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు.

అనంతపురం న్యూటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కదిరిదేవరపల్లి నుంచి గుంతకల్లు, ధర్మవరం, కదిరి మీదుగా తిరుపతికి వెళ్లే ప్యాసింజర్‌ను పేదల బండిగా చెప్పుకుంటారు. షెడ్యూల్ విద్యార్థులు, ఉద్యోగులకు అనుకూలంగా ఉంది. నిత్యం గంటల కొద్దీ ఆలస్యమవుతోంది. సమయానికి వచ్చిన, గమ్యానికి చేర్చిన చరిత్ర లేదని ప్రయాణికులు వాపోతున్నారు. తిరుపతికి ప్యాసింజరు (57404) గుంతకల్లులో ఉదయం 8 గంటలకు బయలు దేరుతుంది. కల్లూరుకు ఉదయం 8.50 గంటలకు వస్తుంది. అక్కడి నుంచి అనంతపురం స్టేషన్‌కు 9.15 గంటలకు చేరుతుంది. గంట, రెండు గంటల వరకు ఆలస్యమవుతోంది. గుంతకల్లు నుంచి ఆ మార్గంలో గూళ్లపాల్యం, వెంకటాంపల్లి, ఖాదర్‌పేట, కల్లూరు, గార్లదిన్నె స్టేషన్ల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు.. జిల్లా కేంద్రం చేరుకోవడానికి చాలా ప్రయోజకరంగా ఉంటుంది. విద్యాలయాలన్నీ 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. సమయానికి అనుగుణంగా చేరుకునే వెసులుబాటు ఉంది. ఇక జిల్లా కేంద్రం, ధర్మవరం మధ్యలో ఉండే స్టేషన్లలోని సమీప ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ ప్యాసింజరు చాలా ప్రయోజకరంగా ఉంటుంది. షెడ్యూల్ మేరకు ఉదయం 10.05 గంటలకు ధర్మవరం చేరాలి. ఆ మార్గంలో వెళ్లే ఉద్యోగులు ఈ ప్యాసింజరు మీద ఆధారపడుతుంటారు. ఏరోజూ సమయం మేరకు రాకపోకలు సాగించిన పాపానపోలేదు. ఒకట్రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోసం చాలామందికి ఉపయోగపడే ప్యాసింజరును ఎక్కడపడితే అక్కడ ఆపేస్తున్నారు. ధర్మవరం వరకు డబుల్ లైన్ ఉంది. సమయానికే నడిపే అవకాశం ఉంది. ఆ దిశగా రైల్వే అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



తిరుపతి ప్యాసింజర్ రైలు

తక్కువ ఖర్చు: ఆనంద్, ప్రయాణికుడు



వ్యాపార నిమిత్తం అనంతపురం నుంచి నిత్య ధర్మవరం, కదిరి ప్రాంతాలకు వెళ్తుంటా. ప్యాసింజరు రైలులో తక్కువ ఖర్చుతో వెళ్లవచ్చు. రైలు సమయానికి రాకపోవడంతో స్టేషన్‌లో పడిగాపులు కాయాల్సి వస్తోంది. సమయానికి వెళ్లకపోతే పనులు ఆలస్యమవడంతోపాటు ఒక్కోసారి జరగవు కూడా. రైలు సమయానికి వస్తే చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

తిరుపతికి వెళ్లేందుకు చాలా అనుకూలం



అనంతపురం నుంచి తిరుపతికి వెళ్లాలంటే ప్యాసింజరు రైలు చాలా అనుకూలం. కుటుంబ సభ్యులతో కలిసి తక్కువ ఖర్చుతో ప్రయాణించవచ్చు. ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తుండడం ఇబ్బందికరంగా మారుతోంది. సమయపాలన పాటిస్తే బాగుంటుంది.

- నాగరాజు, ప్రయాణికుడు

రూ.6 తగ్గిన టమోటా ధర

అనంతపురంరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా ధర ఒక్కరోజులోనే భారీగా పడిపోయింది. కిలోపై ఏకంగా రూ.6 తగ్గిపోయింది. బుధవారం కిలో టమోటాలు గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయాయి. గురువారం కిలో రూ.34కి పడిపోయింది. కనిష్ఠ ధర రూ.20, సరసరా రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మొత్తంగా మార్కెట్‌కు 3,150 టన్నుల టమోటా కాయలు వచ్చాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక

అనంతపురం విద్య, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఫిజికల్ డైరెక్టర్స్ (పీడీలు) సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన పీడీ నరసింహారెడ్డి నియమితులయ్యారు. కృష్ణా జిల్లా కోడూరులో పీడీల అసోషియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. ఈసందర్భంగా జరిగిన రాష్ట్రకమిటీ ఎన్నికలలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లాకు చెందిన పీడీ నరసింహారెడ్డి తెలిపారు. ఆయన ప్రస్తుతం శింగనమల నియోజకవర్గం పెరవలి జడ్పీ హైస్కూల్ పీడీగా పనిచేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నరసింహారెడ్డిని తోటి పీడీలు అభినందించారు.

అక్కడ నిర్మాణాలకు అనుమతించం

- అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్లలో భవన నిర్మాణాలకు భవిష్యత్తులో అనుమతులు ఇచ్చేది లేదని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ స్పష్టం చేశారు. అహుడా కార్యాలయంలో అనధికారిక లే అవుట్లపై చైర్మన్ టీసీ వరుణ్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి 2020కు సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబరు 134 జారీ చేసిందని తెలిపారు. లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) 2025 జూన్ 30వతేదీ వరకు పొడిగించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలించి ఆమోదించినట్లు తెలిపారు. అహుడా పరిధిలో అనధికార లే అవుట్లలో కచ్చితంగా ఎల్ఆర్ఎస్ చేసుకోవడానికి ఇదే చివరి అవకాశం అని తేల్చి చెప్పారు. 2025 జూన్ 30నాటికి ప్లాట్ల రిజిస్ట్రేషన్ అయి ఉండాలని, కనీసం ఒక ప్లాట్ అయినా అమ్మి ఉండాలన్నారు. లే అవుట్ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వెంచర్‌లు వేసి ప్రజలను మభ్యపెడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో అహుడా ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్ చౌదరి, డీఈలు రేవంత్, సరస్వతి పాల్గొన్నారు.

ఖతర్‌లో తనకల్లువాసి మృతి



నూరుల్లా (ఫైల్)

తనకల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నూరుల్లా(36) ఖతర్‌లో గురువారం ఉదయం మృతిచెందాడని బంధువులు తెలిపారు. మూడేళ్ల క్రితం ఖతర్ వెళ్లిన నూరుల్లా.. ఆ దేశంలోని వకారాలో ఓ వ్యక్తి వద్ద డ్రైవర్‌గా పనిచేసేవారు. అప్పటి నుంచి స్వదేశానికి తిరిగి రాలేదు. గత వారం రోజులుగా మనోవేదన చెందేవాడని అతనితో కలిసి పనిచేసిన మరో డ్రైవర్ తమకు తెలిపారని బంధువులు తెలిపారు. యజమానిని జిమ్ సెంటర్‌లో వదిలి, తిరిగివచ్చే సమయంలో మార్గమధ్యంలో ఓ ఫ్లై ఓవర్ వద్ద వాహనాన్ని ఆపాడని, ఫ్లై ఓవర్‌పై నుంచి కిందపడి మృతిచెందాడని సమాచారం వచ్చిందని తెలిపారు. ఆత్మహత్యనా? ప్రమాదమా..? అన్నది తెలియాల్సి ఉంది. నూరుల్లాకు భార్య, ఇద్దరు కూతుళ్లు, తల్లి ఉన్నారు. నూరుల్లా మృతి తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా, ఉదయం మృతిచెందాడని సమాచారం అందగా, సాయంత్రానికి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం వచ్చింది. కానీ కుటుంబ సభ్యులకు ఆ సంతోషం ఎక్కువసేపు నిలవలేదు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సాయం కోరామని బంధువులు తెలిపారు.

ఎరువుల కొరత రాకూడదు

అనంతపురం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామ హేశ్వరమ్మ ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె టెక్నికల్ ఏఓ వంశీకృష్ణతో కలిసి పలు కంపెనీల ప్రతినిధులతో గురువారం సమావేశమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.7 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. డీలర్లు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బందులు పెట్టాలని చూస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇదేం మత్తు..!

(5వ పేజీ తరువాయి)

చేష్టలు, వారి ఆగడాలను భరించలేక, ఎవరితోనూ చెప్పుకోలేక తల్లిదండ్రులు ఇన్నాళ్లూ కుమిలిపోయారు. దాడి ఘటన తరువాత నోరు విప్పుతున్నారు. సుమారు ఏడాది నుంచి నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచిగా చెప్పినా, ఆస్పత్రులకు తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదని కుమిలిపోతున్నారు. పిల్లలను మందలిస్తే ఆ మత్తులో వారు ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడతారోనన్న భయం వారిని వెంటాడుతోంది. పిల్లల భవిష్యత్తును తలచుకుని నిద్రాహారాలు మానుకుని కుంగిపోతున్నారు. గంజాయి సరఫరాపై గట్టి నిఘా పెట్టి, విక్రయదారులు, వినియోగించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎక్కడి నుంచి వస్తోంది..?

విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో దొరికే గంజాయిని వివిధ మార్గాల్లో ఇక్కడికి తెస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా రైళ్లలో భిక్షగాళ్ల ద్వారా తరలిస్తున్నట్లు తెలిసింది. కొంతమంది యువత రైళ్లలో గంజాయిని బ్యాగుల్లో పెట్టి, వారు మరోచోట కూర్చొని దాన్ని గమనిస్తూ ఉంటారు. రైలు స్టేషన్‌కు చేరడానికి రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోనే ఫోన్ల ద్వారా సంబంధిత వ్యక్తులకు సమాచారం ఇస్తారు. వారు రాగానే బ్యాగులు బయటకు విసిరి వేస్తున్నట్లు సమాచారం. అలా కిలోల్లో తెచ్చిన గంజాయిని చిన్నసైజ్ ప్యాకెట్లుగా తయారు చేసి, రూ.50 నుంచి వందకు విక్రయిస్తున్నట్లు సమాచారం. కొందరు సిగరెట్లలోని పొగాకును తీసి, దాని స్థానంలో గంజాయి పొడిని పెట్టి పొగ పీలుస్తున్నారు.

న్యాయం చేయండి..!

తమ పిల్లలపై విచక్షణారహితంగా దాడిచేసినవారిని కఠినంగా శిక్షించాలని ఎస్పీ రత్నను బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి. ఎస్పీ ఎదుటే ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేశారు. కాళసముద్రంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాలలపై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో గ్రామంలో ఎస్పీ మానవహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ ప్రసంగించిన అనంతరం బాధిత తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఐదురోజుల క్రితం తమ పిల్లలను ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు విచక్షణారహితంగా కొట్టారని, చెప్పులు, చింతబర్రలతో దాడి చేశారని వాపోయారు. ఈ సంఘటన వెలుగులోకి వచ్చి మూడు రోజులైనా నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. గ్రామంలోని పలువురు మహిళలు ఎస్పీని చుట్టుముట్టారు. తాము అవమానంతో కుమిలిపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు మహిళలు విషరసాయనాన్ని తాగేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకుని బాటిల్ లాగేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అయినా మహిళలు శాంతించలేదు. ఎస్పీని చుట్టుముట్టడంతో డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ నిరంజన్ రెడ్డి వారికి సర్దిచెప్పేందుకు తంటాలు పడ్డారు. దీంతో గ్రామంలో తీవ్ర గందరగోళం, ఉద్రిక్తత ఏర్పడ్డాయి. డీఎస్పీ దగ్గరుండి ఎస్పీని వాహనంలో ఎక్కించి గ్రామం నుంచి పంపించేశారు. బాధిత మహిళలను శుక్రవారం స్టేషన్‌వద్దకు రావాలని పోలీసులు సూచించారు.



కాళసముద్రంలో పోలీసులను చుట్టుముట్టిన గ్రామస్థులు

బెంగళూరు-బీదర్ ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి బెంగళూరు-బీదర్ (వయా గుంతకల్లు) అప్ అండ్ డౌన్ సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ (06519) ప్రత్యేక రైలు ఈ నెల 14న రాత్రి 9-15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11-30 గంటలకు బీదర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06520) బీదర్‌లో 15న మధ్యాహ్నం రెండున్నరకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం నాలుగున్నరకు బెంగళూరుకు చేరుతుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, వాడి, షంషాబాద్, కలబురగి, హుమ్నాబాద్ మీదుగా బీదర్‌కు చేరుకుంటుందన్నారు.

అక్రమ మద్యం వరద



సుంకం చెల్లించకుండా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా జిల్లాకు చేరిన మద్యాన్ని పారబోస్తున్న అధికారులు (ఫైల్)

గత ఎనిమిది నెలల్లో మద్యం పట్టివేత వివరాలు ఇలా..

మద్యం రకం	కేసులు	అరెస్టులు	సీజ్ చేసిన మద్యం (లీటర్లలో)	సీజ్ చేసిన వాహనాలు
ఎన్‌డీపీఎల్	1,516	1,568	13,534	185
నాటుసారా	615	448	2580	18
బెల్టుషాప్స్ మద్యం	990	996	2,333	77
మొత్తం	3,121	3,012	18,447	280

(5వ పేజీ తరువాయి)

అధికారులు సీజ్ చేశారు.

నాటుసారా రహిత అనంతకు కృషి



గత 8 నెలల్లో జిల్లాలో పెద్దఎత్తున దాడులు చేశాం. అక్రమ మద్యాన్ని కట్టడి చేయడంతోపాటు, కేసులు నమోదుచేశాం. అక్టోబరు 15 తర్వాత ఎన్‌డీపీఎల్ 13,534, నాటుసారా 2580, బెల్టు మద్యం 2,333 లీటర్లు సీజ్ చేశాం. నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించి సీజ్ చేయడంతోపాటు, బెల్లం ఊట 82,235 లీటర్లు ధ్వంసం చేశాం. ఆగస్టు చివరికి నాటుసారా రహిత జిల్లాగా అనంతపురాన్ని మార్చేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం.

-నాగమద్దయ్య, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ శాఖ, ఉమ్మడి జిల్లా

అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి



అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టిపెట్టాం. పాత నిందితుల వివరాలు సేకరించి, వారిని గుర్తించే పనిలో ఉన్నాం. మద్యం అక్రమంగా తయారు చేస్తున్నా, రవాణా చేస్తున్నా ప్రజలు నిర్భయంగా 14405 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చు. కఠిన చర్యలు తీసుకుంటాం.

- శ్రీరామ్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్), ఉమ్మడి జిల్లా

పురం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

- రైల్వే జీఎం ముకుల్ శరణ్ మథూర్

హిందూపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): హిందూపురం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతామని రైల్వేశాఖ బెంగళూరు జనరల్ మేనేజర్ ముకుల్ శరణ్ మథూర్ అన్నారు. ఆయన హిందూపురం రైల్వే స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో ప్రయాణికుల మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. ప్రతి విభాగాన్ని తనిఖీ చేశారు. అమృత్‌భారత్ కింద హిందూపురం రైల్వేస్టేషన్ ఎంపికైందని ఇప్పటికే దానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఏడాది లోపు పనులు పూర్తి చేసి స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రయాణికులకు అవసరమైన లిఫ్ట్, ర్యాంప్, ఎక్సలేటర్‌ను ఏర్పాటు చేయడానికి ఆలోచిస్తున్నామన్నారు. పుట్టపర్తి ప్యాసింజర్ రైలును యథావిధిగా కొనసాగించాలని పలువురు ప్రయాణికులు కోరారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని జీఎం హామీ ఇచ్చారు. ఈయనవెంట డీఆర్ఎం అశితోష్ కుమార్ సింగ్, ఏడీఆర్ఎం పి.మోహన్, స్థానిక రైల్వే స్టేషన్ మాస్టర్ రామచంద్ర, కిరణ్, సోమప్ప తదితరులు ఉన్నారు.



స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న రైల్వే జీఎం మథూర్

క్రైం కార్నర్

ఆటో కింద పడి విద్యార్థిని మృతి


తనూజ (ఫైల్)

గార్లదిన్నె, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం.. ఓ విద్యార్థినిని బలిగొంది. మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం సాయంత్రం ఆటో కింద పడి తనూజ(9) మరణించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దవడుగూరు మండలం ఈరన్నపల్లికి చెందిన వెంకటనాయుడు, నాగసునీత దపంతులు మూడేళ్ల క్రితం కల్లూరు కొండకింద ఇందిరమ్మ కాలనీకి వలస వచ్చారు. ఇక్కడే ఉంటూ కూలి పనులకు వెళ్తుండేవారు. వారికి కుమారుడు, కుమార్తె తనుజ సంతానం. తనూజ కల్లూరు ఆర్ఎస్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుండేది. గురువారం పాఠశాలకెళ్లి సాయంత్రం ఆటోలో ఇంటికి బయల్దేరింది. ఇంటి సమీపంలోకి రాగానే విద్యార్థిని ప్రమాదవశాత్తు జారి కిందపడింది. డ్రైవర్ గమనించకపోవడంతో చిన్నారి కాళ్లు, తలపై ఆటో వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని అదే ఆటోలో పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుమార్తె మృతదేహంపై పడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.


విద్యార్థిని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పెద్దకర్మకు వచ్చి ప్రమాదంలో..

చెన్నేకొత్తపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): బంధువుల పెద్దకర్మకు వచ్చిన ఓ వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన మండలంలోని ఎర్రంపల్లి సమీపంలో గురువారం జరిగింది. హిందూపురం రైల్వే ఎస్ఐ సజ్జప్ప తెలిపిన మేరకు....బుక్కరాయసముద్రం మండలం పసలూరు కొత్తపల్లికి చెందిన నాగలింగారెడ్డి(57) తన బంధువుల పెద్దకర్మకు ఎర్రంపల్లికి వచ్చాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో కాలకృత్యాల కోసం వెళ్లి తిరిగి వస్తూ రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హిందూపురం రైల్వే ఎస్ఐ సజ్జప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పెనుకొండకు తరలించారు. మృతుడికి భార్య సుధారాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

హిందూపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం దేవరపల్లివద్ద గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ సజ్జప్ప తెలిపారు. గురువారం ఉదయం లోకోపైలెట్ ఇచ్చిన సమాచారంతో హెడ్‌కానిస్టేబుల్ యర్రిస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించారన్నారు. మృతుడి వయసు దాదాపు 60 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గొర్రెల కాపరి..

ముదిగుబ్బ, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు గ్రామంలో బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి సాకే వెంకటేష్(42) మృతిచెందాడు. ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాకే వెంకటేష్ గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తుండేవాడు. బుధవారం రాత్రి గ్రామ శివారులోని పొలంలో గొర్రెలు తోలుకున్నాడు. అక్కడే విద్యుత్ స్తంభం పక్కన కిందపడి ఉన్న విద్యుత్ వైరును పక్కకు తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్ కొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేష్ అన్న వెంకటరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సిద్ధేశ్వర ఆలయంలో చోరీ

బత్తలపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి. చెర్లోపల్లి సమీపంలోని సిద్ధేశ్వర ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఆలయంలోని పార్వతీదేవి విగ్రహానికి శ్రావణ మాసం సందర్భంగా రెండు తులాల బంగారం చైను, రెండు తులాల నల్ల పూసల దండ అలంకరించారు. రోజు వారిలాగే పూజారి పవన్‌కుమార్ బుధవారం పూజలు నిర్వహించి గుడికి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం గుడికి వెళ్లి చూడగా పార్వతీదేవి విగ్రహానికి ఉన్న బంగారం, వెండి ఆభరణాలు కన్పించలేదు. విషయాన్ని గ్రామస్థులకు వివరించి, వారితో కలసి బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సర్వజన ఆశలు..!

పెద్దాస్పత్రిలో నెలకు సగటున 65వేల మందికి సేవలు

- అయినా.. 560 పడకలకే పరిమితం
- సూపర్ స్పెషాలిటీ పరిస్థితీ అంతే..
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నేడు విజయవాడకు ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

అనంతపురం వైద్యం, జూలై31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజన, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు.. సర్వజనులకు వైద్యవసేల నిలయాలుగా మారాయి. నెలకు సగటున 65వేలమందికి ఓపీ సేవలందిస్తోంది. 6500మంది అడ్మిషన్ అవుతుంటే. 5వేలమంది డిశ్చార్జ్ అవుతున్నారు. రోగ నిర్ధారణ పరీక్షల విభాగంలోనూ అదేస్థాయిలో గణాంకాలు నమోదు అవుతున్నాయి. ఇంత స్థాయిలో సేవలు అందిస్తూనే నేటికీ 560 పడకల ఆస్పత్రిగానే మిగిలిపోయింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కష్టాలు మరోలా ఉన్నాయి. సూది, మందు కావాలన్నా సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ అనుమతి తీసుకోవాలి. పక్కనే సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఉన్నా.. తీసుకోవడానికి వీల్లేదు. ఎలక్ట్రికల్, ఏసీ, ఐసీయూ, లిఫ్ట్ తదితర సేవల్లో తరచూ అంతరాయం తప్పడంలేదు. ఇక మెడికల్ కాలేజీలో పీజీ, యూజీ విద్యార్థులకు అవసరమైన కంప్యూటరైజ్ట్ సౌకర్యాలు కరువయ్యాయి. లైబ్రరీ, గ్యాలరీ, సెమినార్ హాళ్లు తదితర సౌకర్యాల్లేక పాతపద్ధతిలోనే చదవాల్సి వస్తోందని విద్యార్థివర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. నూతన భవన నిర్మాణాలు, సౌకర్యాల కల్పనపై ఎంత చెప్పినా తక్కువేనని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్యవిద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా శుక్రవారం వైద్యవిద్య సంచాలకుడు (డీఎంఈ) అనంతపురం జిల్లాకు సంబంధించి సమీక్షించున్నారు. దీంతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ షారోన్ సోనియా, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ ఆత్మారామ్ గురువారం బయలుదేరి వెళ్లారు. ఇక్కడి పరిస్థితులను పరిశీలించి, మెరుగైన వైద్యసేవలు అందించేలా డీఎంఈ నిర్ణయం తీసుకునేరా అంటూ రోగులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.


నిర్మాణదశలో సర్జికల్ బ్లాక్ భవనం


సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఐసీయూ వార్డులో పనిచేయని ఏసీ

560 పడకలకే పరిమితం

జిల్లా ఆసుపత్రి నుంచి బోధనాసుపత్రిగా 2000 సంవత్సరంలో 560 పడకల ప్రభుత్వ సర్వజన వైద్యశాల అప్‌గ్రేడ్ అయింది. ఆ మేరకే డాక్టర్లు ఇతర పారామెడికల్ సిబ్బంది పోస్టులను మంజూరు చేశారు. 560 పడకల ప్రకారమే ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, క్రిటికల్ కేర్ యూనిట్లు, క్యాజువాలిటీ తదితర విభాగాలను ఏర్పాటుచేశారు. 25ఏళ్లలో ఓపీ, ఐపీ, ఓటీ సేవల సంఖ్య పెరిగిపోయింది. ప్రస్తుతం నెలకు సగటును 65వేలమంది ఓపీ సేవలు పొందుతున్నారు. ఈ లెక్కన 1500 పడకలు అవసరం. పోస్టులను మూడింతలు పెంచాలి. సరాసరి 3000 చొప్పున మేజర్, మైనర్ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఆ మేరకు ఆపరేషన్ థియేటర్లు, సదుపాయలు, టెక్నీషియన్లు తదితరాలను అప్‌గ్రేడ్ చేయాలని ఆస్పత్రుల వర్గాలు వివరిస్తున్నాయి. 700 వరకు ప్రసవాలు జరుగుతున్నా.. సౌకర్యాల లేమితో ఇబ్బందులు తప్పట్లేదు.

సిబ్బంది కొరత

సర్వజనాస్పత్రి, వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. 40శాతం మాత్రమే రెగ్యులర్ ఇబ్బంది ఉన్నారు. 30శాతం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పనిచేస్తున్నారు. 30శాతం కొరత ఉంది. దీని ప్రభావం వైద్యవిద్య, ఓపీ, ఐపీ, క్యాజువాలిటీ సేవలపై పడుతోంది. సూపర్ స్పెషాలిటీలోని తొమ్మిది విభాగాలకుగాను ఇద్దరు ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నారు. తొమ్మిది మంది అసోసియేట్ ప్రొఫెసర్లకుగాను నలుగురు, 18మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకుగాను 9మంది ఉన్నారు. మొత్తం 36 పోస్టులకుగాను 21 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోనే ఖాళీగున్నాయి. సర్వజన వైద్యశాల, నాన్ క్లినికల్ విభాగాల్లోనూ అదే సమస్య వెంటాడుతోంది.

నిర్మాణాలకు నిధుల లేమి

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ, ఐపీ సంఖ్య ప్రతి సంవత్సరం రెట్టింపు అవుతోంది. ఈ క్రమంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పెంచేందుకు 2014-19లో అప్పటి పాలనాధికార వర్గం, ప్రభుత్వం శ్రమించాయాయి. ఇక్కడి పరిస్థితులను కళ్లకు కట్టేలా లేఖలో రూపంలో కేంద్ర ప్రభుత్వానికి వివరించారు. కేంద్ర ప్రభుత్వ స్పందించి ప్రత్యేక సహాయం కింద రూ.300కోట్లను ఇస్తామని హామీనిచ్చింది. దీంతో నాలుగు బ్లాక్‌లతో మూడు అంతస్థుల సర్జికల్ బ్లాక్, ఆరు అంతస్థులతో పీజీ హాస్టల్ భవనాలు, తల్లీబిడ్డ ఆస్పత్రి(ఎంసీహెచ్)ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. తెలుగు తల్లి విగ్రహం వద్దనున్న ఇరిగేషన్ కార్యాలయంలో సర్జికల్ బ్లాక్, వైద్య కళాశాలలో పీజీ హాస్టళ్ల పనులు మొదలుపెట్టారు. ఆర్ అండ్‌బీ కార్యాలయంలో తలపెట్టిన ఎంసీహెచ్ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. నిధుల లేమి సమస్యగా మారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక నిర్మాణపనులు చేపట్టారు. నిధులు వస్తేనే పనులుపూర్తవుతాయని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.

ఎంపీ నిధులతో..

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తన ఎంపి ల్యాండ్స్ కింద నిధులను ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. రూ.40లక్షలతో మేల్ బ్లాక్, రూ.35లక్షలతో ఫిమేల్ బ్లాక్ పేర్లతో విశ్రాంతి ధామాల నిర్మాణపనులు జరుగుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీ)ను నిర్మిస్తున్నారు. కాలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ(సీడీఎస్) నిధులతో రూ.16లక్షల అంచనా వ్యయంతో క్యాంటీన్ మరమ్మత్తులకు శ్రీకారం చుట్టారు.

ప్రతి అంశం క్షుణ్ణంగా...



టీచింగ్, పీజీ, ల్యాబ్స్, పారామెడికల్ ఇలా ప్రతి అంశంపై క్షుణ్ణంగా నివేదికలు రూపొందిస్తున్నాం. కళాశాల, సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మూడింటి అభివృద్ధిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. విభాగాల వారీగా వివరాలను, అప్‌గ్రేడ్ అంశాలను నివేదికల రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తున్నాం. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నారు.

- షారోన్ సోనియా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

అభివృద్ధివైపు అడుగులు



ఆస్పత్రి అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. నాణ్యమైన వైద్యసేవలకు అవసరమైన సౌకర్యాలు, వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. క్యాడర్ల వారీగా సిబ్బంది వివరాలు తెలియజేస్తున్నాం. 560 పడకల నుంచి వెయ్యి పడకలకు పెంచేలా దృష్టి సారించాం.

- ప్రొఫెసర్ ఆత్మారామ్, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్

పీఏబీఆర్‌లోకి కృష్ణాజలాలు


ఎంఎం హళ్లి గ్రామం వద్ద పీఏబీఆర్‌లోకి వెళ్తున్న కృష్ణాజలాలు

కూడేరు, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఏబీఆర్‌లోకి కృష్ణాజలాలు చేరుతున్నాయి. జీడిపల్లి రిజర్వాయర్ నిండిపోవడంతో గురువారం 2 వేల క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లోకి వదిలారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లో నీటి మట్టం 426.900 అడుగుల వద్ద 1.875 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ ఏఈ లక్ష్మీదేవి తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయడంతో ఎంఎంహళ్లి గ్రామ సమీపాన వంకలో నీటి ఉధృతి పెరిగింది. పీఏబీఆర్‌లోకి నీరు చేరుతుండటంతో కుడికాలువ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీటెక్ ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, జూలై31(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలోని బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు గురువారం ఫలితాలను విడుదల చేశారు. జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం పరిధిలో జూన్, జూలై నెలలలో నిర్వహించిన పరీక్షలు బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్(ఆర్20) అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ రెండో సెమిస్టర్ (ఆర్21), రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబీఏ ఒకటో సెమిస్టర్(ఆర్21) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంసీఏ రెండో సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ మొదటి సెమిస్టర్(ఆర్21)సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మాడీ, నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్(ఆర్17) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎ.పి.శివకుమార్, అడిషనల్ కంట్రోలర్ ఆచార్య శంకర్‌శేఖర్‌రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు కీలకం: వైవీ

శింగనమల, జూలై 31(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు కీలకమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురంలో గురువారం అయన మీడియాతో మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధికి గత ఐదేళ్లలో కేంద్రం ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాకే జమ చేసుకుంది తప్ప.. అభివృద్ధికి నయాపైసా కూడా ఇవ్వలేదన్నారు. కూటమి పాలనలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు.

ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పనిసరి

అనంతపురం కలెక్టరేట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): క్రమబద్ధీకరణ కాని ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అహుడా అనుమతి తప్పనిసరి అని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ్ శర్మ స్పష్టం చేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అహుడా విభాగంలోని ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. అహుడా పరిధిలో ల్యాండ్ బ్యాంక్‌ను ఎక్కువగా గుర్తించాలని ఆదేశించారు. ఎంఐజీ లేఅవుట్‌లలో అభివృద్ధిపై ఆరాతీశారు. అనంతపురం, మడకశిర, కళ్యాణదుర్గం, గుత్తి, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ ప్రాంతాల్లో చేపట్టిన చర్యలు, ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అహుడా అధికారులు పాల్గొన్నారు.

మార్గదర్శకుల గుర్తింపులో పురోగతి

పీ4 కార్యక్రమం కింద మార్గదర్శకుల గుర్తింపులో పురోగతి తీసుకొస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ్ శర్మ అన్నారు. ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ తదితరులు పాల్గొన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మార్గదర్శకుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగరంలో శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ, వాహనాల తరలింపు తదితర అంశాలపై శ్రద్ధ పెట్టామన్నారు.

బలహీన వర్గాల కోసమే టీడీపీ ఆవిర్భావం

- నందమూరి రామకృష్ణ


విలేకరులతో మాట్లాడుతున్న నందమూరి రామకృష్ణ

బొమ్మనహాళ్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీని దివంగత ఎన్టీఆర్ స్థాపించారని ఆయన తనయుడు నందమూరి రామకృష్ణ పేర్కొన్నారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం మండల కేంద్రానికి వచ్చిన అయన విలేకరులతో మాట్లాడారు. తెలుగువాడి పౌరుషాన్ని ఢిల్లీకి పరిచయం చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని కీర్తించారు. తెలుగువాడి సత్తాను చాటిచెప్పడానికి పార్టీని స్థాపించారని తెలిపారు. గతంలో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్లు అధికారంలో కొనసాగుతుందని అన్నారు. అంతకుముందు ఆయన్ను కాలవ భరత్ శాలువతో సత్కరించి స్వాగతించారు. ఆయన వెంట టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీటీ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, సింగల్ విండో చైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, టీడీపీ నాయకులు కొత్తపల్లి తిమ్మరాజు, పయ్యావుల అనిల్ తదితరులు ఉన్నారు.

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురంరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ. 15వేల ధరతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.4వేలు, సరాసరిగా రూ.10,100 పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1336 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఔట్ ఫ్లో 2 వేల క్యూసెక్కులు

బెళుగుప్ప, జూలై 31(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ఔట్ ఫ్లో 2 వేల క్యూసెక్కులు వెళ్తున్నట్లు గురువారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో 2100 క్యూసెక్కులు వస్తోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.729 టీఎంసీల నీరు నిల్వ ఉందని వెల్లడించారు.

పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన నమోదు చేస్తున్న పౌరసత్వ చట్ట సవరణను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఓ హోంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిహార్ రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదమవుతుందని పేర్కొన్నారు. పౌరుల ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఇందులో ఉన్నాయన్నారు. బీజేపీకి రాజకీయ లబ్ధి చేకూర్చేందుకు దీన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. బిహార్‌లో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఇలాంటివి అమలు చేయడం తగదన్నారు. ఈ ఎస్ఐఆర్‌ను బిహార్‌కు మాత్రమే కాక దేశమంతటా అమలు చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించడం దారుణమన్నారు. నాలుగేళ్ల కిందట దేశవ్యాప్తంగా ప్రజలు తిరస్కరించిన పౌరసత్వ చట్ట సవరణ, జాతీయ పౌరసత్వ రిజిస్టర్ చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని దుయ్యబట్టారు. విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ బిహార్‌లో దాదాపు 30 లక్షల మంది వలస కార్మికులను ఓటరు జాబితాను తొలగించాలని నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, లాయర్స్ అసోసియేషన్ నాయకులు సతీష్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్, వెంకటనారాయణ, ఇర్ఫాన్, వలి, మసూద్, నగర కమిటీ సభ్యులు రాజు, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, రామాంజినమ్మ, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరగా పూర్తి చేయించండి: జేడీఏ

అనంతపురం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'ఏం మీకు చెప్పేది అర్థం కావడం లేదా..? అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులతో ఇంకా ఈకేవైసీ ఎందుకు చేయించలేదు. పెండింగ్‌లోని ఎన్‌పీసీఐ లింక్ చేయించడంపై నిర్లక్ష్యం ఎందుకు' అని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ పలు మండలాల ఏఓలపై మండిపడ్డారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి టెక్నికల్ ఏఓలు శశికళ, రాకేష్, వంశీకృష్ణలతో కలిసి గురువారం ఆమె మండలాల ఏఓలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులకు సంబంధించి పెండింగ్ లోని ఈకేవైసీ, ఎన్‌పీసీఐ లింక్‌పై పలు మండలాల ఏఓలను ఆమె ప్రశ్నించారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీతోపాటు ఎన్‌పీసీఐ లింక్ వెంటనే పూర్తి చేయించేలా చొరవ చూపాలన్నారు. అన్నదాత సుఖీభవ సొమ్ము అర్హులైన రైతులందరికీ జమ అయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లోని ఈకేవైసీ పూర్తి చేయడంతోపాటు సంబంధిత బ్యాంక్ అధికారులతో మాట్లాడి, పెండింగ్‌లోని 7802 మంది రైతుల ఎన్‌పీసీఐ లింక్‌ను త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు.

కొడుకుతో కలిసి భర్త హత్య

- ఆస్తి దక్కకుండా పోతుందనే దారుణం
- కారుతో ఢీకొట్టించి.. ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం
- పోలీసుల దర్యాప్తులో హత్యగా నిర్ధారణ
- నిందితుల అరెస్టు

గార్లదిన్నె, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆస్తి ఎక్కడ దక్కకుండా పోతుందోనని భర్తనే హత్య చేయించింది ఓ భార్య. కుమారుడితో కలిసి పథకం పన్ని కారుతో ఢీకొట్టించి, ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. పోలీసుల దర్యాప్తులో హత్యగా తేలడంతో నిందితులను అరెస్టు చేశారు. మండలంలోని జంబులదిన్నె గ్రామానికి చెందిన కోయిటాకు నల్లప్ప హత్య కేసులో అతడి భార్య లక్ష్మి, కుమారుడు ఆశ్రయ్ అలియాస్ ఆర్య, అక్క కుమారుడు కట్లపొడి శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అనంతపురం డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. జంబులదిన్నె గ్రామానికి చెందిన నల్లప్ప, లక్ష్మి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. గతంలో తెలంగాణ రాష్ట్రం తాండూరు మండలం మల్రెడ్డిపల్లికి వలస వెళ్లినపుడు నల్లప్పకు ఆ ఊరికి చెందిన నవీనతో పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయమై నల్లప్పతో భార్య గొడవ పడడంతో ఐదేళ్ల క్రితం స్వగ్రామానికి చేరుకున్నారు. అయినా నల్లప్ప.. నవీనతో సంబంధం కొనసాగిస్తుండడంతో భార్య మళ్లీ గొడవపడింది. నల్లప్ప ప్రవర్తనలో మార్పు రాకపోగా నవీనతో సంబంధాన్ని వదులుకోనని, భార్యకు విడాకులు ఇస్తానని తెగేసి చెప్పాడు. అదే జరిగితే ఆస్తి తన కుమారుడికి దక్కకుండా పోతుందేమోనని లక్ష్మి భావించింది. భర్తను హత్య చేయాలని భావించింది. కుమారుడు బోయ ఆశ్రయ్ అలియాస్ ఆర్య, అక్క కుమారుడు కట్లపొడి శ్రీకాంత్‌తో కలిసి పథకం పన్నారు. అందులో భాగంగా గత నెల 23న నల్లప్ప జంబులదిన్నె సమీపంలోని చీనీ తోటకు వెళ్లి ద్విచక్రవాహనంపై గార్లదిన్నె వైపు వస్తుండగా శ్రీకాంత్ అద్దెకు తెచ్చిన కారుతో ఢీకొట్టి వెళ్లిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నల్లప్ప అక్కడికక్కడే మరణించాడు. రోడ్డు ప్రమాదంగా భావించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని, లోతుగా దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంపై నల్లప్ప బంధువులు అనుమానాలు వ్యక్తం చేయడం, ఢీకొట్టి వెళ్లిపోయిన దొరకడంతో పోలీసులు హత్యగా నిర్ధారించారు. ఆ మేరకు లక్ష్మి, ఆశ్రయ్, కట్లపొడి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు. వారిని గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా, సిబ్బంది గురుమూర్తి, అంజినేరెడ్డి, కృష్ణ, రామాంజి, దివాకర్, నగేష్, నరేష్, వెంకటేష్, చాగంటి వెంకటేష్, తిరుమలేస్‌నాయుడు, రంగారెడ్డి, జిలాన్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

ఎండుతున్న పంటలు

● అడుగంటుతున్న భూగర్భ జలాలు
● ఆందోళనలో రైతులు


క్రిష్ణాపురం వద్ద ఎండుముఖం పట్టిన వేరుశనగ


మండ్యెంవారిపల్లిలో ఎండిన మిరప పంట

నంబులపూలకుంట, జూలై31(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పంటలు పండుతాయని ఆశించిన మండల రైతులకు వరుణుడు కరుణించలేదు. దీంతో భూగర్భ జలాలు సైతం అడుగంటిపోతున్నాయి. సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలో మండలంలో వర్షాలు కురవకపోయినప్పటికి నీటి తడుల ద్వారా పొలాలను దుక్కిచేసి, సాగుకు సిద్ధం చేశారు. రెండునెలల క్రితం కురిసిన ఓ మోస్తరు వర్షానికే విత్తనాలు వేశారు. ఆపై వర్షాలు కురవక పంటలు ఎండుతున్నాయి. ఇదిలాఉంటే వర్షాలు కురవక భూగర్భజలాలు అడుగంటి బోరుబావుల్లో నీటి మట్టం తగ్గిపోయింది. అరకొర నీటితో తడులు ఇవ్వలేకపోవడంతో పంటలకు ఎండుముఖం పట్టాయి. మండలంలో వేరుశనగ ఎక్కువగా నీటిపారకం కింద సాగవుతుంది. అయితే ప్రస్తుతం గాలి ఎక్కుగా ఉండడంతో బిందు, తుంపర సేద్యం పరికరాలతో పంటకు నాలుగువైపులా నీరు అందించలేకపోతున్నారు. మండలవ్యాప్తంగా 20వేల ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం. ఇందులో మెట్ట భూమి 15వేల ఎకరాలు, తడి భూమి 5వేల ఎకరాలు ఉన్నట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. ఖరీఫ్‌లో బోరుబావుల కింద మూడు వేల ఎకరాల్లో వేరుశనగ సాగుచేశారు. మండల వ్యాప్తంగా 2,250 బోరుబావులు ఉన్నాయి. వీటి కింద సాగుచేసిన పంటలు ప్రస్తుత పరిస్థితుల్లో పూర్తిగా చేతికొస్తాయా అనే సందేహం రైతుల నుంచి వ్యక్తం అవుతోంది. పశుగ్రాసానికి కూడా రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఊరుగాని ఊర్లుకు వెళ్లి పశువులను మేపుకోవాల్సిన దుస్థితి నెలకుంది.

అప్పులు చేసి బోర్లు

సాగుచేసిన పంటలు కళ్ల ఎదుటే ఎండిపోతుంటే రైతులు అప్పులు చేసి మరీ బోర్లు వేస్తున్నారు. ప్రస్తుతం ఒక బోరు వేయాలంటే రూ.లక్షకుపైగా ఖర్చు వస్తుంది. విధిలేని పరిస్థితుల్లో ఓ రైతు తన జీవనాధారమైన గొర్రెలను విక్రయించి రెండు బోర్లు వేశాడు. నీరు పడలేదు. పలువురు రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. పంటను కాపాడుకోకపోతే పెట్టుబడులు కూడా దక్కవని అప్పులు చేసి బోర్లు వేస్తున్నారు. నీరు పడకపోతే అప్పు భారం పెరుగుతోంది. ఎలా జీవించాలని దేవునిపైన భారం వేసి ప్రయోగాలు చేస్తున్నారు. అలాగే సాగుచేసిన పంటను కాపాడుకోవడానికి, సాగుకు అయిన పెట్టుబడిని తీర్చుకోవడానికి రైతులు ఆగచాట్లు పడుతున్నారు. కొందరు రైతులు సుదూర ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లో ఉన్న నీటితో పైపుల ద్వారా పంటకు తడులు ఇస్తున్నారు. ప్రస్తుతం వేరుశనగ పూత దశలో ఉంది. తడులు ఇవ్వలేకపోతుండడంతో ఎండు ముఖం పట్టింది. ఇప్పుడు ఎంత నీరు అందిస్తే అన్ని పిందెలు వస్తాయి. ఇలాగే పదిరోజులు వర్షం కురవకపోతే పంట పూర్తిగా ఎండిపో యే ప్రమాదముంది. ఉద్యాన పంటలు సాగుచేసిన రైతుల పరిస్థితి ఆగమ్యగోచరం. పెట్టుబడులు అధికం. మార్కెట్‌లో కూరగాయాల ధరలు ఆశజనకంగా ఉన్నాయి. కానీ పంటలకు నీరు అందించలేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

పంట ఎండుతోంది



నేను ఐదెకరాల్లో రెండు నెలల క్రితం వేరుశనగ విత్తనం వేశా. ప్రస్తుతం కలుపు తీశాం. ఈ సమయంలో తడులు ఇవ్వాల్సి ఉంది. బోర్లలో నీరు రావడంలేదు. పక్క బోర్లలోనూ అంతే. ఈ ప్రాంతంలో నీరు అడుగంటి పోయింది. ఐదెకరాల్లో పంట సాగుకు రూ.1.20లక్షలకుపైగా ఖర్చు అయింది. దీంతో ఇతర రైతుల వద్ద పైపులను తీసుకొచ్చి, దాదాపు 600 మీటర్ల దూరంలోని నేరేడు చెరువు నుంచి నీటిని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. - రఘురాం, గంగినాయునివారిపల్లి

వరి కోసం మిరపను ఎండబెట్టా



నాకున్న ఐదెకరాల్లో... అర ఎకరాలో మిరప సాగుచేశా. ఎకరాలో వరి సాగుకు సిద్ధం చేశాం. వరినారు నాటేందుకు నీరు చాలకపోవడంతో ప్రస్తుతం మిరప పంటకు నీరివ్వడంలేదు. తిండి గింజలైనా పండుతాయని ఎంతో ఆశతో ఉన్నా. వరి నారుకు నీటి తడులిచ్చి కాపాడుకుంటున్నాం. వర్షాలు కురవకపోతే వరి సాగుకు వీలుండదు. నారుకూడా ఎండిపోతుంది. - నరసింహులనాయుడు, మండ్యెంవారిపల్లి

న్యూస్ బాక్స్

నేడు మంత్రి సత్యకుమార్ పర్యటన

ధర్మవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ధర్మవరం పట్టణంలో పర్యటించనున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ ఇతర నాయకులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రితో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పాల్గొంటా రన్నారు. ఉదయం 11గంటలకు 35వ వార్డులో జరిగే 'మీ సమస్య- మా బాధ్యత' కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్‌తో పాటు మంత్రి సత్యకుమార్ పాల్గొని సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు.

నేడు ఎమ్మెల్యే కందికుంట పర్యటన

నల్లచెరువు, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బసవన్నకట్ట సమీపంలో సామాజిక పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం హాజరుకానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబు, గుత్తా ప్రసాద్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

నల్లమాడ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ సీఈసీలో 39సీట్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ సుధారాణి గురువారం తెలిపారు. పది ఉత్తీర్ణులైన విద్యార్థినులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తి ఉన్నవారు పాఠశాలకు వచ్చి సంప్రందించాలని కోరారు. వివరాలకు 9704550140కు సంప్రదించాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి రూ.5లక్షలు విరాళం

నల్లచెరువు, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న చౌడేశ్వరీదేవి ఆలయానికి స్థానిక యల్లమ్మస్వామి వీధిలో నివాసముంటున్న బండి ప్రతాప్ రూ.5లక్షలు116 విరాళం అందించారు. గురువారం ఆయల కమిటీ సభ్యులు చిప్పల మడుగు ఆంజనేయులు, అల్లుగుండు చంద్ర, క్రిష్ణకు అందజేశారు.

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయండి

ఓబుళదేవరచెరువు, జూలై 31(ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌస్‌లాజం గురువారం ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలో గురువారం వర్చువల్ సమావేశంలో వారు మాట్లాడారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

● జిల్లా వనరుల కేంద్రం డీడీఏ రామునాయక్

ధర్మవరం రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన పంటలను తప్పక ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ రామునాయక్ సూచించారు. స్థానిక ఏన్‌జీఓ హోంలో గురువారం ఈ పంట నమోదుపై డివిజన్‌స్థాయి రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి డీఆర్‌సీ డీడీఏ రామునాయక్, పుట్టపర్తి ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త రామసుబ్బయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ థకాలు వర్తిస్తాయన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటల సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. బెట్ట పరిస్థితుల నుంచి పంటలు తట్టుకోవడానికి 5శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పంటలకు పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఏడీఏ లక్ష్మానాయక్, ధర్మవరం ఏఓ ముస్తఫా, డివిజన్‌లోని ఏఓలు, ఏఈఓలు, ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు


మాధవ్‌తో మండల నాయకులు

ఓబుళదేవరచెరువు, జూలై 31(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ, ఉపాధ్యక్షుడు సోముగుట్ట విష్ణు వర్ధన్‌రెడ్డిని ఆ పార్టీ మండల నాయకులు గురువారం కలిశారు. పుట్టపర్తిలో కార్యక్ర మంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇడగొట్టు వీరాంజి, ప్రధాన కార్యదర్శి కుంచెపు సురేష్ కలిశారు.

జూదరుల అరెస్ట్

బత్తలపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పత్యపురంతండాలో గురువారం పేకాట స్థావరంపై బత్తలపల్లి పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పేకాట స్థావరం పైదాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న ఇద్దరు దొరికారని, మరో ముగ్గరు పారిపోయాని ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,820 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. మొత్తం ఐదుగురి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసులు లింగమయ్య, ఆంజినేయులు, నాగార్జున, గోపాల్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

నల్లమాడ, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎద్దులవాండ్లపల్లి తండా సమీపంలోని పొలాల్లో బోరుబావుల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆరుగురిని గురువారం తండావాసులు పట్టుకున్నారు. వారి వివరాల కోసం తండావాసులు ప్రశ్నించగా, పొంతనలేని సమాధాలు చెప్పడంతో పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే సీఐ నరేంద్రరెడ్డి, సిబ్బందితో తండాకు వెళ్లి నలుగురిని అదుపులోకి తీసుకోగా, ఇద్దరు పరారయ్యారు. నలుగురితోపాటు కారును అదుపులోకి ఓడీసీ పోలీస్ స్టేషన్‌కు తరలించి, విచారిస్తున్నట్లు సమాచారం. ఈవిషయంపై సీఐని వివరణ అడుగగా అనుమానితులను విచారిస్తున్నామని, విచారణలో తెలిసిన సమాచారం తరువాత అందజేస్తామన్నారు.

275-2 సర్వే నంబర్ భూమి సర్వే

నంబులపూలకుంట, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కదిరి-రాయచోటి రహదారి పక్కనున్న 275-2 నెంబర్ భూమిని గురువారం తహసీల్దార్ దేవేంద్రనాయక్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతంలో మల్లిరెడ్డికుంట నుంచి దిగువనున్న దేవరచెరువుకు వర్షపు నీరు ఈ ప్రాంతం గుండా ప్రవహిస్తుందన్నారు. ఇక్కడి ప్రభుత్వ భూమిని గుర్తించామన్నారు. ఈ భూమిలో ల్యాండ్ కన్వర్షన్ అనంతరం అహుడా అనుమతి వచ్చే వరకు ప్లాట్లు వేయకూడదన్నారు. ఆయనతోపాటు ఎంపీడీఓ పార్థసారథి, ఈఓఆర్డీ మాధవరెడ్డి, వీఆర్‌ఓలు నాగరాణి, రఘు, సర్వేయర్ పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ప్లాట్లకోసం భూమిని చదును చేస్తుండగా తహసీల్దార్ తదితరులు నిలిపివేశారు.

భూసారాన్ని బట్టి ఎరువులు వాడండి: ఏడీఏ

నల్లమాడ, జూలై 31(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని వ్యవసాయ శాఖ ఏడీ సనావుల్లా రైతులకు సూచించారు. మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ... ప్రస్తుతం యూరియా, నానో డీఏపీ రైతులకు అందు బాటులో ఉన్నాయన్నారు. నానో యూరియా 2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి ఎకరా భూమికి పిచికారి చేయాలన్నారు. నానో డీఏపీ 3 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి అర ఎకరాకు వాడుకోవాలన్నారు. జిప్సమ్ కూడా వినియోగించవచ్చన్నారు. రైతు సేవాకేంద్రాల్లో ఎరు వులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం సక్రమంగా వర్షాలు పడకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆగస్టు 15 లోగా వర్షాలు కురిస్తే కంది సాగుచేయాలన్నారు. ఏఓ అబ్దుల్‌హక్, మండల విస్తీర్ణ ఆధికారి వెంకటరంగాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్థిరత్వం సాధించాలి

● ఎమ్మెల్యే కందికుంట


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎస్పీ రత్న, ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఆర్థిక స్థిరత్వం సాధిస్తే... సమాజంలో ని అంతరాలు తొలిగిపోతాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. దాతల సహకారంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను గురువారం ఎస్పీ వి. రత్నతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కదిరి ప్రాంతంలో మహిళల అదృశ్యం, మహిళల కేసులు ఎక్కువగా ఉన్నాయని ఎస్పీ చెప్పకనే చెప్పారన్నారు. ఈ విషయాన్ని గ్రహించి, ఈ ప్రాంతంలో ప్రతి కుటుంబం ఆర్థిక స్థిరత్వం సాధించే దిశగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సీసీ కెమెరాలకు ఆర్థిక సాయం అందజేసిన ఆంజనేయులు, క్రిష్ణమోహన్‌నాయుడును అభినందించారు. త్వరలోనే పోలీసులకు కొత్త వాహనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... కదిరి సబ్‌డివిజన్‌కు మహిళల అదృశ్యం, మహిళ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వాటిని పరిష్కరించేందుకు పోలీసులు కృషిచేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో లక్ష సీసీకెమెరాల ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కదిరిలో మొట్టమొదటిసారిగా దాతల సహకారంతో రూ.43లక్షల ఖర్చుతో ఏర్పాటు చేయడం గర్వించతగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కు మార్, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు నారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి, నాగేంద్ర, ఎస్ఐ బాబ్‌జాన్, పోలీస్ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు మీఇంటికొచ్చాం: ఎమ్మెల్యే

గాండ్లపెంట, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం మండలంలోని కటారుపల్లి పంచాయతీ కటారుపల్లి క్రాస్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించడంతో పాటు సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ప్రజలు వివిధ సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రతి సమస్యను పరిష్కరించడానికే మీ ఇంటివద్దకు వచ్చానని, అన్నిటినీ పరిష్కరిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, మహిళ నాయకురాలు పర్వీన్ బాను, టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య, ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, బావాసాబ్, ఆనంద్, రెడ్డినాయక్, సికిందర్, నరసింహులు, దాసిరెడ్డి, తుంగా వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్, రవీంద్రారెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, ఓబులరెడి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కస్తూర్బా గాంధీ టైప్-4 బాలికల వసతి గృహాన్ని ప్రారంభించారు. విద్యావంతుడైన విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ విద్యార్థుల చదువులు, వసతులపై దృష్ట పెట్టి మెరుగైనవిద్యను అందిస్తున్నారని, అందుకే మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ దేవరాజ్ జీడీపీఓ సంపూర్ణ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాబురావు, ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, ఎంఈఓ క్రిష్ణానాయక్, హెచ్ఎం ప్రసాద్, కేజీబీవీ ఎస్ఓ జ్యోత్స్న, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి'


ధర్మవరంలో సమస్యలను విన్నవిస్తున్న కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి

ధర్మవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ కోరారు. స్థానిక ము న్సిపల్ కార్యాలయం సమావేశ భవనంలో గురు వారం కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలను జూనియర్ అసిస్టెంట్ చదివి వినిపించారు. అనంతరం 37వ వార్డు కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ... మున్సిపాలిటీలో పలు పనులకు ఏడాదిగా టెండర్లు పిలుస్తున్నారని, ఆ పనులు చేపట్టారా అని ప్రశ్నించారు. చేపట్టి ఉంటే అవి ఎంతవరకు వచ్చాయన్న సమాచారాన్ని తెలియజేయాలన్నారు. అదేవిధంగా వార్డులలో నెలకొన్న పారిశుధ్యం, వీధిలైట్లు, పందుల సంచా రం, వీధికుక్కల బెడద తదితర సమస్యలను ఆయా వార్డు కౌన్సిలర్‌లు కమిషనర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కమిషనర్ ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షంషాద్ బేగం, కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

● కదిరి: మున్సిపల్ కౌన్సిల్‌లో లేవనెత్తిన సమస్యలు వెంటనే పరిష్క రించాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కౌన్సిల్ హాల్‌లో చౌర్‌పర్సన్ దిల్షాదున్నీషా ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ గతనెల కౌన్సిల్ సమా వేశంలో కౌన్సిలర్లు లేవనెత్తన సమస్యలను ఇప్పటి వరకు పరిష్క రించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గదుల్ల అద్దె చెల్లించని వారికి నోటీసు లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పట్టణంలో డైవైడర్ల వద్ద ఉన్న చెట్లును తొలగిం చాలని, వాటిద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని మండి పడ్డారు. మురుగునీరు, తాగు నీటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆ జెండాలోని కొన్ని అంశా ల ను వాయిదా వేసి, ఆమో దించారు. సమావేశానికి ఇన్‌చార్జ్ కమిషనర్ సందీప్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.


కదిరి సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా

శ్మశానవాటిక సమస్యను పరిష్కరించండి

● పరిటాల శ్రీరామ్‌కు కేతిరెడ్డి కాలనీ వాసుల వినతి


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని 28వ వార్డుకు చెందిన ప్రజలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌కు విన్నవించారు. ఆయన గురువారం పట్టణంలోని 25, 26, 27, 28 వార్డులలో మీ సమస్యా-మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. వాటిలో చిన్నచిన్న సమస్యలను ఆయన అక్కడికక్కడే పరిష్కరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని పరిటాలశ్రీరామ్ ప్రజలకు తెలియజేశారు. తమ ప్రాంతంలో శ్మశాన వాటిక సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కేతిరెడ్డికాలనీ వాసులు విన్నవించగా, మున్సిపల్ అధికారులతో మాట్లాడి అనువైన స్థలం చూపుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నాయకులు ఫణికుమార్, 25వ వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, నాయకులు పురుషోత్తంగౌడ్, మాధవరెడ్డి, సందా రాఘవ, గుడిపాటి చంద్ర, చీమల రామాంజి, టైలర్ గోపాల్, గడ్డం సూరి, చీమల సూరి, క్లస్టర్ రామాంజి, సురేశ్, అమరా, బొట్టుకిష్ట, జింకల రాజన్న, గస్తీ ఓంకార్, రామకృష్ణ, ఆనందరెడ్డి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



● ధర్మవరం రూరల్: టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి తదితరులు గురువారం మండలంలోని ధర్మపురి, రావులచెరువు గ్రామాల్లో 'మీ సమస్య- మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు.



● తాడిమర్రి: టీడీపీ మండల కన్వీనర్ కూచిరామ్మోహన్ తదితర టీడీపీ నాయకులు గురువారం మండలంలోని నారసింపల్లి, నిడిగల్లు గ్రామాలో 'మీ సమస్య- మా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు.

3న ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన చెన్నేకొత్తపల్లిలో ఆగస్టు 3న ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు ధర్మవరం స్పందన ఆస్పత్రి వైద్యులు సోనియా, బషీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీకేపల్లి సీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తామన్నారు.

ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే సింధూరారెడ్డి


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

అమడగూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రజల శ్రేయస్సే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. వారు గురువారం మండలకేంద్రంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. అనంతరం స్థానిక సొసైటీ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ గోపాల్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు ప్రమాణ స్వీకారం అనంతరం శాలువా, పూలమాలతో చైర్మన్‌ను సత్కరించి అభినందించారు. అనంతరం పోలీస్ స్టేషన్ మీదుగా ప్రచార రథంలో ర్యాలీగా బస్టాండ్ ప్రాంతానికి చేరుకుని నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. బడుగు, బలహీనవర్గాల పార్టీ టీడీపీ అన్నారు. ప్రజల సంక్షేమం కోసం పార్టీ పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన క్యాదర్శి కలవకుంట్ల ఆంజనేయులు, మండల కన్వీనర్ గో పాల్‌రెడ్డి, ఓడీసీ మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు శ్రీనివాసులరెడ్డి, కాలేనాయక్, శ్యామ్ బాబునాయుడు, క్రిష్ణమూర్తి, సర్పంచ్ షబ్బీర్, సుధాకర్‌రెడ్డి, అశోక్, ఆంజనేయులు, పాల శీనా, కాడా సిద్దు, భాస్కర్, పెద్దన్నయ్య, అబ్దుల్ రఫ్వా తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే మండలంలోని మహమ్మదాబాద్‌లో టీఎంఆర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. పిల్లలకు విద్యాబోధన చేశారు.

ఆస్పత్రి భవనం మంజూరు చేయండి

● వైద్యఆరోగ్యశాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి బాబా చిత్రపటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్ర మైన ఓబుళ దేవర చెరువులో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఆసుపత్రి స్థానం లో నూతన భవనాన్ని మంజూరు చేయాలని రాష్ట్ర వైద్యఆరోగ్యాశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ఎమ్మెల్యేపల్లె సింధూరారెడ్డి కోరారు. బీజేపీ శోభాయాత్రలో పాల్గొనేందుకు గురువారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్‌ను కలిశారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తి అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని, ఓడీ చెరువులో నూతన ఆస్పత్రి భవనాన్ని మంజూరుచేయాలని మంత్రికి విన్నవించారు. కొత్తచెరువులో అర్థాంతరంగా ఆగిపోయిన 50 పడకల ఆసుపత్రి భవనాన్ని పూర్తిచేయాలని ఎమ్మెల్యే కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సత్యసాయి చిత్రపటాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే బహూకరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రనాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్, జిల్లా నాయకులు లాయర్ హరికృష్ణ, గుడెసె దేవానంద్, రామాంజినేయులు, జ్యోతిప్రసాద్, కొండమరాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధిక వడ్డీ వేధింపులపై కఠిన చర్యలు: ఎస్పీ

● దంపతులపై దాడి కేసులో నిందితుల అరెస్ట్

పుట్టపర్తి రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అధికవడ్డీలతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవన్ని ఎస్పీ వి.రత్న వడ్డీ వ్యాపారులను హెచ్చరించారు. అధిక వడ్డీల పేరిట ధర్మవరం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన దంపతులపై దాడి కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ధర్మవరం టూటౌన్ ఎస్ఐ రెడ్డెప్పతో కలసి కేసు వివరాలను వెల్లడించారు. ధర్మవరం పట్టణంలోని భారతి, రమణ కుటుంబ సభ్యులను బెదిరించి అధిక వడ్డీ డబ్బులు వసూలు చేశారని హింసా త్మకంగా దాడిచేశారనే కేసులో ఐదుగురు నిందితులు మండల మహేష్, ముద్దనగుల వినోద్, గుజ్జల హేమంత్ కుమార్, గుంజర గోవర్దన్, జెర్రిపోతుల మనోహర్‌ను ఎన్ఎస్‌గేట్ రోడ్డులోని కేతిరెడ్డి కాలనీ సమీపంలో అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న యెర్రగుంట్ల రాజా కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు తెలిపారు. అతడిపై పల ఏపోలీసుస్టేషన్లలో రౌడీ షీట్ నమోదైందన్నారు. నిందితులపై పీడీయాక్ట్ అమలుచేసే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో నిరుపేద ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేస్తూ దోపిడీచేస్తున్న వడ్డీ వ్యాపారులపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. వాటిని రూపుమాపేందుకు పోలీసు శాఖ పరంగా అన్నిచర్యలు చేపడతామన్నారు. ఎవరైనా బాధితులు ఉంటే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదుచేయవచ్చన్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో ఆర్ఐలు వలి, మహేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విగ్రహాల ఊరేగింపు



సీతారాముల విగ్రహాలు, కలశాలతో వస్తున్న భక్తులు

లేపాక్షి, జూలై 31(ఆంధ్రజ్యోతి): బిసలమానేపల్లి గ్రామంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న సీతారామచంద్రుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం కొనసాగింది. సీతారామ విగ్రహాలు, కలశాలను భక్తులు గ్రామంలో ఊరేగించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా మధ్యారాధన



స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు

పెనుకొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): లక్ష్మీకాంత తీర్థుల ఆరాధనోత్సవంలో భాగంగా రెండోరోజు మధ్యారాధనను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం పండితులు స్వామివారి మఠంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం భక్తమండలి సభ్యులు నగర సంకీర్తన చేపట్టారు. మఠం నిర్వాహకులు పాలూరి క్రిష్ణమూర్తి, వీహెచ్ శ్రీనివాసులు, అర్చకుడు బాస్కర్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ప్రాణ ప్రతిష్ఠ



కలశాలు మోస్తున్న మహిళలు

పరిగి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటకూరు గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మూడు రోజులపాటు గంగపూజ నిర్వహించి మహిళలు పెద్దఎత్తున జ్యోతులను ఊరేగించి స్వామికి సమర్పించారు. మహామంగళహారతి, అర్చనలు, అభిషేకాలు, కలశపూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన చేపట్టారు.

పేదల కష్టాలు తీర్చిన నాయకుడు చంద్రబాబు



దివ్యాంగులకు రేషన్ అందిస్తున్న చైర్మన్ నరసింహరాజు

మడకశిర టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పేదల కష్టలను తీర్చిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు అన్నారు. గురువారం 17వ వార్డు, చాకలి కుంట తదితర కాలనీల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదలకు సక్రమంగా నిత్యావసర సరుకులు అందుతున్నాయన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్లు ఉమాశంకర్, నాగేంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు తిమ్మరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

కందులను సద్వినియోగం చేసుకోండి



రైతులకు కందులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

గుడిబండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు ఉచితంగా అందిస్తున్న కందులు, రాగులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ కోరారు. గురువారం మండలంలోని సీసీగిరి రైతు సేవా కేంద్రంలో రైతులకు ఉచితంగా కందులు, రాగులను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమ అభివృద్ధికి పెద్దపీట వేసిందని అన్నారు. కందులు, రాగులను రైతులు పొలాల్లో విత్తుకొని మంచి దిగుబడి సాధించాలని రైతులకు సూచించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది శివకుమార్, నాయకులు తిప్పేస్వామి, సిద్దప్ప, నీటీ స్వామి, రంగప్ప పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం

అమరాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): కష్టపడే కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని వైసీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ అన్నారు. గురువారం హనుమంతపల్లి గ్రామం, కె.శివరం పంచాయతీ కమిటీల ఏర్పాటుకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఈరలక్కప్ప, కార్యదర్శి మధుమతిరెడ్డి, హలుకూరు కాంతరాజు, నాగేష్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కష్టపడే ప్రతి నాయకుడికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. క్రిష్ణమూర్తి, రంగేగౌడ్, శివన్న పాల్గొన్నారు.

ఎల్లోటిలో చోరీ

మడకశిర రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లోటి గ్రామంలో ఓ ఇంటిలో రూ.2 లక్షల నగదును దుండగులు చోరీ చేశారు. బాధితుడు విజయనాయక్ తెలిపిన వివరాల మేరకు కల్లుమర్రి గ్రామం వద్ద సిమెంట్ ఇటుకలు తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిమెంట్, ఇసుక, కూలీలకు డబ్బు ఇచ్చేందుకు ఇంట్లో రూ.2లక్షలు ఉంచి పని నిమిత్తం ఇటుకల తయారీ కేంద్రానికి వచ్చానన్నారు. పనిముగించుకుని ఇంటికి వెళ్లేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసి ఇంట్లో వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన రూ.2 లక్షలు కనిపించలేదన్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై సీఐ నగేష్‌బాబును విచారించగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1వార్డులో నివాసముంటున్న 29 ఏళ్ల మహిళ మాత్రలు మింగి గురువారం ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ కలహాల కారణంగా ఆమె నొప్పులకు ఉపయోగించే 20 మాత్రలను మింగినట్లు వైద్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉషా చికిత్సలు చెసి, మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

ఆదాయం ఘనం... అభివృద్ధి శూన్యం

- అద్దెల వసూళ్లపై ఉన్న శ్రద్ధ సౌకర్యాలపై లేదు
- ఆర్టీసీ బస్టాండులో తాగునీరు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం



అధ్వానంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు

పెనుకొండ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు ఆర్టీసీ బస్సు సర్వీసుల వినియోగం అధికమవుతోంది. ఆర్టీసీ యాజమాన్యం ఆదాయం మీద చూపుతున్న శ్రద్ధ సౌకర్యాలపై చూపడంలేదు. పెనుకొండ ఆర్టీసీ బస్టాండు అసౌకర్యాలకు నిలయంగా మారింది. ఈ బస్టాండు నుంచి బెంగళూరు, హైదరాబాద్, అనంతపురం, మడకశిర, పావగడ, పుట్టపర్తి తదితర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. డిపోనుంచి నుంచి 23 రూట్లకు 83 బస్సు సర్వీసులు రాకపోకలు కొనసాగిస్తాయి. ఇవికాకుండా ఇతర డిపోల నుంచి వందల సర్వీసులు వచ్చి వెళుతుంటాయి. ప్రతిరోజూ డిపోకు రూ.2లక్షల ఆదాయం వస్తుంటుంది. ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న దుకాణాలకు రూ.3 లక్షలు డిపోకు ఆదాయం వస్తుంది. కానీ ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండు చుట్టూ ప్రహరీ నిర్మించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి నెలా అద్దెల ద్వారా రూ.3లక్షల ఆదాయం

బస్టాండుకు చెందిన స్థలంలో 40షాపులు అద్దెకు ఇచ్చారు. వీటిద్వారా ప్రతినెలా రూ.3లక్షల ఆదాయం వస్తుంది. అయినా తాగునీరు, మరుగుదొడ్లులేవు. ఆర్టీసీ బస్టాండులోపల రోడ్లులేక దుమ్ముధూళితో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



బస్టాండు ఆవరణలో ప్రైవేట్ వాహనాల పార్కింగ్

మందు బాబులకు అడ్డాగా బస్టాండు: పెద్దన్న, పెనుకొండ



పెనుకొండ ఆర్టీసీ బస్టాండు నుంచి పలు ప్రాంతాలకు వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడే మద్యం సేవిస్తుంటారు. వారిని అరికట్టే సిబ్బందిలేరు. ఇష్టారాజ్యంగా ఆర్టీసీ బస్టాండు ఉంది. ప్రయాణికులకు బస్టాండులో మెరుగైన సౌకర్యం కల్పించాలి.

ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా: జాఫర్, పెనుకొండ



ఆర్టీసీ బస్టాండు చాలా విశాలంగా ఉంది. పూర్తిస్థాయిలో హద్దులు లేకుండా పోవడంతో ప్రైవేట్ వాహనాలు రాత్రివేళల్లో ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు వేచి ఉండాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాలు అధ్వానంగా ఉండి దుర్వాసన వెదజల్లుతుంటాయి. ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలి.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం: రంగభాష్యం, డిపో మేనేజర్

ఆర్టీసీ బస్టాండులో సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల జిల్లా ప్రజారవాణా అధికారి పర్యవేక్షించారు. ప్రస్తుతం తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలపై మరమ్మతులు చేస్తున్నాం. మందుబాబులను అరికట్టేందుకు ఆర్టీసీ పోలీస్ సిబ్బందికి ఏర్పాటు చేస్తాం.

ఎంఈఓల బాధ్యతల స్వీకరణ

రొద్దం, జూలై 31(ఆంధ్రజ్యోతి): పలువురు ఎంఈఓలు బాధ్యతలు స్వీకరించారు. రొద్దం ఎంఈఓగా అరవిందబాబు బాధ్యతలు స్వీకరించారు. గురువారం మడకశిర జడ్పీ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన అరవింద్‌బాబు ఉద్యోగోన్నతిపై రొద్దం ఎంఈఓగా నియమితులయ్యారు. ఎంఈఓ జయభాస్కర్, ఉపాధ్యాయులు మల్లికార్జున, సిబ్బంది నరేష్, ఖాజా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అగళి: అగళి ఎంఈఓగా కృష్ణమూర్తిరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొన్నేళ్లుగా ఎంఈఓ-1 లేకపోవడంతో ఎట్టకేలకు కదిరి హైస్కూల్‌లో పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆయన ఇక్కడికి వచ్చారు. ప్రైమరీ ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది ఆయనను సన్మానించారు. ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

అమరాపురం: మండల విద్యాశాఖాధికారిగా సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రాఘవయ్య పెనుకొండ ఎంఈఓగా బదిలీపై వెళ్లడం తెలిసిందే. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు.

ఏఎస్ఐగా రామాంజనేయులు

గోరంట్ల, జూలై31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐగా ఎం. రామాంజనేయులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. హిందూపురం వన్‌టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయనను ఖాళీగా ఉన్న గోరంట్ల అర్బన్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గతంలో ఆయన ఇక్కడ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుమలలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళశాలలో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాధకృష్ణ కోరారు. అర్హులైన విద్యార్థులు 4వ తేదీలో దరఖాస్తులు అందించాలన్నారు. ఎస్ఎస్‌సీ పాసు, ఇంటర్ ఫెయిల్ అయిన వారు సంబంధిత సర్టిఫికెట్లతో రావలన్నారు. వివరాల కోసం 9505504206 నంబరును సంప్రదించవచ్చన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

రొళ్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచినట్లు ఎస్ఐ వీరాంజనేయులు అన్నారు. గురువారం దొమ్మరహట్టి గ్రామంలో సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రజలతో సమావేశం ఏర్పాటుచేసి గ్యాంబ్లింగ్, సైబర్ క్రైం, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. అగళి ఎస్ఐ వీరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించవద్దు

పెనుకొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు బిగించరాదని కోరుతూ సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌వద్ద గురువారం స్మార్ట్‌మీటర్లు బిగించరాదని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. నాయకులు బాబావలి, గంగాధర్, మహబూబ్‌బాషా, హబీబ్, వెంకటేశులు, రాజారాం, సూరి, నాగమ్మ, నరసమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

అగళి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు 2వ తేదీన కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని ప్రారంభించనున్నారు. మండలంలో ఇంకా 68 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. వారు రైతు సేవా కేంద్ర సిబ్బంది వద్ద ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. 237మంది రైతులు ఎన్‌సీపీఐ లింకు లేవన్నారు. వారు బ్యాంక్, పోస్టాఫీస్‌కు వెళ్లి నమోదు చేసుకోవాలని ఏవో నాగరాజు సూచించారు.

సందడిగా సుపరిపాలనలో తొలిఅడుగు



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

లేపాక్షి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా అన్ని గ్రామాల్లోనూ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని తెలుగుతమ్ముళ్లు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మండల కన్వీనర్ వెంకటాపురం అబి ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గోపిందేవరపల్లిలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి సంక్షేమ పథకాలను వివరించారు.

ముగిసిన కుట్టు శిక్షణ

పరిగి, జూలై 31(ఆంధ్రజ్యోతి): బీసీ మహిళల కోసం మూడు నెలల క్రితం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. పెద్దరెడ్డిపల్లి గ్రామంలోని తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి మంత్రి సవిత ఆదేశాల మేరకు 140మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పించారు. శిక్షణను పూర్తి చేసిన మహిళలకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సోమప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామంలో స్థానిక మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఏర్పాటు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆదిశేషారెడ్డి, సర్పంచ్ బాలాజీ, శాసనకోట వెంకటేశు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

మడకశిర టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ శైలజకుమారి సూచించారు. గురువారం వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు రాగి పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాగి పంట విస్తీర్ణాన్ని పెంచాలని, విత్తనశుద్ధికి జీవ ఎరువులు అయినా రైజోబియం అసిటోబాక్టర్, పీఎస్‌బీ వంటి ఎరువులను వాడాలన్నారు. అనంతరం వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఏఓ తిమ్మప్ప, అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ

రొళ్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఎరువులు, విత్తనాల వాడకంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడీ శైలజ కుమారి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రైతులు పండిస్తున్న పంటలు విత్తనాల నాణ్యతను ప్రయోగశాలలో పరీక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటబ్రహ్మం, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, పాండురంగప్ప, ఈరన్న, కిష్టప్ప, రామక్రిష్ణ, నాగేంద్ర, గోవిందప్ప పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నాణ్యతను పెంచండి

సోమందేపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనపథకాన్ని పకడ్బందీగా అమలు చేయడంతోపాటు భోజన నాణ్యతను పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సభ్యుడు నజీర్ కోరారు. గురువారం స్థానిక జడ్పీ పాఠశాల విద్యార్థులకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. మండల కార్యదర్శి బాబు, అభిషేక్, నాగేంద్ర, జశ్వంత్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సోమందేపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ నరసింగప్ప సూచించారు. గురువారం సివిల్ రైట్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసినసమావేశంలో ఆయన పాల్గొని చట్టాలపై వివరించారు. క్షణికావేశంలో జీవితాలను పాడుచేసుకోవద్దన్నారు. సీఐ రాఘవన్, ఎస్ఐ రమేష్, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, న్యాయవాది శివరామక్రిష్ణ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాధవ్‌కు వినతిపత్రం ఇస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

గోరంట్ల, జూలై31(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు వాల్మీకి రిజర్వేషన్ సమితి నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. మాధవ్ పుట్టపర్తి పర్యటన సందర్భంగా గోరంట్లకు చెందిన వాల్మీకి రిజర్వేషన్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మన రాష్ట్రంలో వాల్మీకులు ఐదు జిల్లాల్లో ఎస్టీలుగాను, మిగిలిన 8 జిల్లాల్లో బీసీలుగా కొనసాగుతున్నారన్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. వాల్మీకులందరినీ ఎస్టీలుగా పరిగణించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. వాల్మీకులు చంద్ర, మూర్తి, నరసింహమూర్తి, వేణుగోపాల్, రామాంజనేయులు పాల్గొన్నారు.

రెండు ఆటోల ఢీ.. ఏడుగురికి గాయాలు

- మతిస్థిమితం కోల్పోయిన డ్రైవర్ బాలకృష్ణ

పరిగి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మహిళా కార్మికులతో వెళ్తున్న రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు తీవ్రంగా గాయపడగా ఆటో డ్రైవర్ బాలక్రిష్ణ మతిస్థిమితం కోల్పోయిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు ఇండియన్ గార్మెంట్స్‌కు చెందిన మహిళా కార్మికులు పరిగి నుంచి కోనాపురానికి ఆటోలో వెళ్తుండగా, కాలువపల్లి నిషా గార్మెంట్స్‌కే చెందిన మహిళా కార్మికులు మరో ఆటోలో కర్ణాటక రాష్ట్రం గోడేటికి వెళ్తూ మండల కేంద్రంలోని నయారా పెట్రోల్ బంక్ వద్దకు రాగానే ఎదురెదురుగా ఆటోలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు మహిళా కార్మికులు సుగణ, రామాంజినమ్మ, భావన, కాలువపల్లి గార్మెంట్స్ కార్మికులు జయమ్మ, నాగమణి, నాగరత్నలు గాయపడ్డారు. స్థానికులు గమనించి 108సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒక ఆటోలో 16మంది కార్మికులను ఎక్కించుకుని అతివేగంగా నడపడంతోనే ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



తీవ్రంగా గాయపడిన కార్మికురాలు



విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత

పరిటాల కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు

- స్థలాన్ని పరిశీలించిన మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): దివంగత నేత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహ ఏర్పాటుకు మంత్రి సవిత స్థలాన్ని పరిశీలించారు. గురువారం స్థానిక ఇంజనీర్లు, నాయకులతో కలిసి పట్టణంలో అనువైన ప్రాంతాన్ని పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ పెనుకొండ మాజీ ఎమ్మెల్యేగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి పరిటాల రవి అని కొనియాడారు. ఇంజనీరు జగదీశ్, ఎగువింటి సోమశేఖర్, రామలింగ, కౌన్సిలర్ గిరి, కన్వీనర్ శ్రీరాములు, పాలడుగు చంద్ర, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ: నియోజకవర్గంలో వేర్వేరు ఘటనల్లో మృతిచెందిన వారి కుటుంబాలను మంత్రి సవిత పరామర్శించారు. గోరంట్ల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అంజనేయులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అలాగే దిగువగంగంపల్లికి చెందిన సంతోష్ నాయక్ అనుమానాస్పద స్థితి మృతిచెందాడు. వారి కుటుంబాలను మంత్రి ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పరిటాల విగ్రహం ఏర్పాటు హర్షణీయం

- ఎమ్మెల్యే పరిటాల సునీత

పెనుకొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి దివంగత పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయడానికి మంత్రి సవిత సంకల్పించడం, అందుకు స్థలపరిశీలన చేయడం హర్షణీయమని పరిటాల రవి సతీమణి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేస్తూ పెనుకొండపై పరిటాల రవీంద్ర ముద్ర చెరిగిపోనిదన్నారు. ఆయన ఎప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయికి నిలిచి ఉంటారన్నారు. ఆయన భావితరాలకు గుర్తుండేలా పెనుకొండలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

రొద్దం, జూలై 31(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త భాస్కర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స చేయించుకునేందుకు వెళ్తుండగా మంత్రి సవిత రూ.50వేలు ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. పెద్దపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త భాస్కర్‌రెడ్డి బెంగళూరుకు వెళ్తుండగా మార్గమధ్యలో మంత్రిని కలవగా రూ.50వేలు ఆర్థిక సాయాన్ని మెరుగైన వైద్యం చేయించుకుని ఆరోగ్యంగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. అధైర్య పడవద్దు అండగా నేనుంటానని మంత్రి భరోసా కల్పించారు. మాధవనాయుడు, రామాంజనేయులు, వెంకటేశు, శ్రీరాములు పాల్గొన్నారు.

తల్లికి వందనం నగదు అందజేత



సిద్ధక్కకు నగదు అందజేస్తున్న దృశ్యం

పరిగి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సిద్ధక్క కుమారుడు నవనీత్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల తల్లికి వందనం నగదు విద్యార్థి తల్లిఖాతాలో కాకుండా గొర్రెపల్లి గ్రామానికి చెందిన ఎస్. నవదీప్ తండ్రి నాగరాజు ఖాతాలో జమకావడంతో ఆంధ్రజ్యోతిలో ఇతరుల ఖాతాలోకి తల్లికి వందనం అనే కథనం వెలువడింది. ఇందుకు స్పందించిన హెచ్‌ఎం కృపాసత్యరాజ్ పరిశీలించి నాగరాజ్‌ను ఫోన్‌లో సంప్రదించి వారికి తిరిగి నగదు అందజేయాలని కోరగా వారు గురువారం సిద్ధక్కకు ఆ నగదును అందజేశారు. మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, నాగభూషణం, సచివాలయ సిబ్బంది వీరశంకర్, అచ్యుత్ పాల్గొన్నారు.

పారదర్శకంగా కారుణ్య నియామకాలు


మున్సిపల్ చైర్మన్ రమేష్



కారుణ్య నియామకాలు పొందినవారితో చైర్మన్, కమిషనర్

హిందూపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల కారుణ్య నియామకాలు పారదర్శకంగా జరిగాయని చైర్మన్ రమేష్ అన్నారు. గురువారం ఇటీవల రిటైర్మెంట్ అయిన కార్మికులు కొంతమంది మరణించిన వారి కుటుంబాలు 17మందికి కారుణ్యనియామకపత్రాలు అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిశుభ్రత కోసం పాటుపడిన కొంతమంది మృతిచెందిన కుటుంబాలలోని 17మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. కమిషనర్ మల్లికార్జున, కౌన్సిలర్ సతీష్, నవీన్, హరి, సుమోశీన, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్ పాల్గొన్నారు.

మాధవ్‌ను కలిసిన బీజేపీ నాయకులు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో మడకశిర నాయకులు

మడకశిర టౌన్, జూలై31(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను గురువారం పుట్టపర్తిలో మడకశిర నాయకులు కలిశారు. నియోజకవర్గంలో బీజేపీని గ్రామస్థాయి నుంచి అభివృద్ధి, పార్టీ పటిష్ఠతకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బసవరాజు, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పుట్టపర్తికి తరలిన బీజేపీ నాయకులు

గోరంట్ల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పుట్టపర్తి పర్యటన సందర్భంగా గురువారం గోరంట్ల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పిలుపు మేరకు వారు శోభాయాత్రలో వారు పాల్గొన్నారు. కన్వీనర్ లక్ష్మీనారాయణ, శంకర్‌రెడ్డి, నాగరాజు, చలం, గంగాధర్, శంకర్, చంద్ర, హరీష్, అశోక్, రామాంజనమ్మ, ముంతాజమ్మ పాల్గొన్నారు.

బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేద్దాం



పార్టీలో చేరినవారికి కండువాకప్పి ఆహ్వానిస్తున్న మాధవ్

పెనుకొండ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేద్దామని విశ్వహిందూపరిషత్ పట్టణ అధ్యక్షుడు వేదవ్యాస్ పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమక్షంలో జరుగుతున్న ర్యాలీ, బహిరంగసభకు జిల్లా అధ్యక్షుడు శేఖర్‌స్వామి ఆధ్వర్యంలో 120కుటుంబాలు ర్యాలీగా వెళ్లాయి. ఎనుమల రామక్రిష్ణ, గోపీ, రామాంజనేయులు పాల్గొన్నారు.